పెన్ పవర్
తెలంగాణ రౌండప్

- పేదలకు 24 గం. వైద్య సేవలు అందించాలి, ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి..
- అంగన్‌వాడీల్లో మౌలిక వసతులు, పౌష్టికాహారం మెరుగుపరచాలి..
- సఖి కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ ఉండాలి: ఎంపి ఈటల రాజేందర్..
- నిరాశ్రయులకు హోమ్‌లెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలి..
- స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలి..
- పార్కులు, చెరువుల అభివృద్ధితో పాటు రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేయాలి..!
- యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి..
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, క్రీడలకు ప్రాధాన్యత..
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిరుపేదలకు పారదర్శకంగా కేటాయించాలి..
- ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన పరిచి, వ్యవసాయ వనరులు కల్పించాలి..

సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు..





ఈటల రాజేందర్.. మెంబర్ ఆఫ్ పార్లమెంట్ మల్కాజిగిరి..

# పేదలకు విద్య, వైద్యానికి... ప్రథమ ప్రాధాన్యత..!



సిఎంసి కమిషనర్ సృజన ఐఏఎస్..



ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి..

## జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ ఈటల..

- ప్రభుత్వ పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి.!
- విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులపై మేడ్చల్ కలెక్టరేట్‌లో శాఖల వారీగా సమీక్ష..
- ఎమ్మెల్యేలు సి.హెచ్. మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు..
- జిల్లా కలెక్టర్ మను చౌదరి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి..
- సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, ఏసిఎల్‌బి ఏ.సి ఫైజాన్ అహ్మద్..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 9: ప్రభుత్వ పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పేదలకు అందించే విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. శుక్రవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశానికి ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షత వహించారు.. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో కీలక విషయాలు ప్రస్తావించారు.. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలు, జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి (మేడ్చల్), మర్రి రాజశేఖర్ రెడ్డి (మల్కాజిగిరి), బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్) తోపాటు, మల్కాజిగిరి మున్సిపల్

-4లో

## కేబీహెచ్‌బీలో రోడ్డు ఆక్రమణలపై..
# సిఎంసి కొరడా..!

కమిషనర్ ఆదేశాలతో రమ్య గ్రౌండ్ ప్రధాన రహదారిపై కూల్చివేతలు..



- పోలీసు భద్రత నడుమ ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు..
- ప్రజల ఫిర్యాదులకు స్పందించి.. ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక డ్రైవ్.
- జేసీబీలతో ఆక్రమణలు తొలగింపు..పోలీసు భద్రత నడుమ ఫుట్‌పాత్‌లు క్లియర్..
- మళ్లీ ఆక్రమణలు జరగకుండా నిరంతర నిఘా అవసరం..!

-5లో

## బౌరంపేట్ సర్వే నెం.578, 580లో..
# అక్రమ నిర్మాణాలు..

- 2022 జూన్‌లో కూల్చినచోటే..! 2026 అక్టోబర్‌లో మళ్ళీ కబ్జాలు..
- తాజాగా దాదాపు 6 బేస్మెంట్‌లు- 2 గదుల నిర్మాణం.. అంతా బహిరంగమే..!
- పట్టపగలే అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కబ్జాదారులు..

- ప్రభుత్వ భూమిలో.. ఏళ్ళు గడుస్తున్నా కొద్ది..! మారుతున్న భూ సమీకరణాలు..
- కబ్జాలపై వరుస కథనాలు..అయినా చీమ కుట్టినట్టు లేదంటే..?రక్షకులా..బక్షకులా..?
- గతంలో పాత ప్రభుత్వ పట్టాలకు దుండిగల్ రెవెన్యూ అధికారుల బహిరంగ సహకారం..
- నాడు బీఆర్‌ఎస్..! నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏదైనా..! 'కబ్జాలు-సిఫార్సులు' కామన్..!
- దుండిగల్ గండిమైసమ్మ మండలంలో జవాబుదారీ తనానికి చెక్..
- సమాధానం చెప్పలేక ఫోన్‌లు బ్లాక్ చేసే తహాశీల్దార్ సారు.. దీనికి మీ సమాధానం..?
- తిలాపాపం..తలా పిడికెడుగా బౌరంపేట్, 578, 580, భూముల పంపకమా..?
- ఇందిరమ్మ కాలనీ ఆనుకొని ఉన్న 580 ప్రభుత్వ భూమిలో కొత్తగా మళ్ళీ కబ్జాలు..
- సుమారు రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూమిలో అక్రమార్కుల నూతన వెంచర్..
- అధికారుల బరితెగింపు విధులతో..ప్రభుత్వ భూములు పరాధీనం..
- ఖాళీస్థలాలు కనిపిస్తే కబ్జాలేనా..! ఈ నిర్మాణాలకు ఏ పట్టాలు ఉన్నాయో..?

-6లో



## బతుకమ్మ పండుగ వేళ..
# దుండగుల విధ్వంసకాండ..!

-దంతాలపల్లి మండలం దాట్లలో బతుకమ్మ విగ్రహాలు, శిలాఫలకం ధ్వంసం..

- పండుగకు ముందే అపచారం.. బతుకమ్మ తల్లీ, కూతుళ్ల విగ్రహాల ధ్వంసం..!
- శిలాఫలకాన్నీ వదలని దుండగులు.. గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం..!
- బతుకమ్మ సంబరాల వేళ ఈ దుశ్చర్య.. స్థానికుల్లో ఆందోళన..!
- దంతాలపల్లి పోలీసులకు ఫిర్యాదు.. రంగంలోకి దిగిన పోలీసులు..!
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ రవికుమార్.. కేసు నమోదు..!
- ధ్వంసం వెనుక అసలు కారణాలేంటి..? నిందితులెవరో తేల్చేందుకు దర్యాప్తు..!

-8లో



# పేదలకు విద్య, వైద్యానికి.. ప్రథమ ప్రాధాన్యత..!



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి,

-3 పేజి తరువాయి

కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ఐఏఎస్, అడిషనల్ కలెక్టర్ (ఏసిఎల్‌బి) ఫైజాన్ అహ్మద్ ఐఏఎస్, జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ తోపాటు మున్సిపల్ ఛైర్మన్లు, అన్ని శాఖల కేంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు..

## పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..

మల్కాజిగిరి, సైబరాబాద్ కమీషనరేట్ల పరిధుల్లో నీడలేని పేదవారికి ఆశ్రయం కల్పించే విధంగా హోమ్‌లెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ (స్వయం సహాయక సంఘాలు) బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పరిశుభ్రతను పాటించాలని, గర్భిణీలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల కొరతను భర్తీ చేసి వాటి పనితీరును మెరుగు పరచాలని అధికారులను ఆదేశించారు..

గృహహింసకు గురవుతున్న మహిళలకు అండగా నిలిచేందుకు 'సఖి' కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలతో కూడిన లేబర్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.. సరిపడా వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని నియమించి పేదలకు 24 గంటల పాటు మెరుగైన వైద్య సహాయం అందించాలని, ఇందుకు అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని సూచించారు.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పేద కార్మికులకు (బిపిఎల్) అత్యవసర చికిత్స అందించేందుకు అన్ని ఆసుపత్రుల్లో అవసరమైన సేవలు కల్పించాలని మెడికల్ అధికారులను ఆదేశించారు..



## యువతకు నైపుణ్య శిక్షణ.. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు..

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా శిక్షణ అందించాలని ఎంపీ ఈటల అధికారులను కోరారు.. శిక్షణ పొందిన యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ పారిశ్రామిక, విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి బ్యాంకులు అందించే రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.. బలహీన వర్గాలు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలు, ఇతర అర్హులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా చూడాలని సూచించారు. పరిశ్రమల శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ పరిశ్రమలకు సంబంధించిన రుణాలను అర్హులకు సకాలంలో అందించాలని ఆదేశించారు.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులను వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని తెలిపారు. జిల్లా ఖనిజ నిధులను (డిఎంఎఫ్) ప్రధానంగా విద్య, వైద్యం, అత్యవసర మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించాలని స్పష్టం చేశారు..




ఈటల రాజేందర్‌కు మొక్కను అందజేసి ఆహ్వానించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి.

## పార్కుల అభివృద్ధి, చెరువుల పరిరక్షణపై దృష్టి..

నగర వనాల యోజన కింద పట్టణ పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ ఈటల రాజేందర్ అధికారులకు సూచించారు. రోడ్ల విస్తరణకు సంబంధించి, అటవీ శాఖ త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు.. జిల్లాలోని పార్కులను అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.. వెట్‌ల్యాండ్ చెరువులను గుర్తించి వాటి పరిరక్షణకు కంచె ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. జిల్లాలో రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, పిఆర్ ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈటల సూచించారు.. వివిధ శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు..

## నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు..

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత పాటించాలని ఎంపీ ఈటల రాజేందర్ ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులను నిష్పక్షపాతంగా ఎంపిక చేసి, నిరుపేద ప్రజలకు ప్రాధాన్యతనిస్తూ ఇళ్లను కేటాయించాలని సూచించారు.. రైతులకు వ్యవసాయ వనరులు అందుబాటులో ఉండాలి.. ఎల్‌నినో ప్రభావానికి రైతులు గురికాకుండా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీ సూచించారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.. వ్యవసాయ రంగానికి సంబంధించిన అవసరాలను గుర్తించి రైతులకు తగిన సహకారం అందించాలని పేర్కొన్నారు.. జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు, పేదలకు విద్యా, వైద్య సేవలు, యువతకు ఉపాధి, రైతులకు సహకారం, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు.. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలి..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజనం నిర్ణీత మెను ప్రకారం నాణ్యతతో ఉండాలని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. పాఠశాలల్లో మెను బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని అన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ( డిఎంహెచ్‌వో) సహకారంతో విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.. పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులు మానసికంగా, శారీరకంగా బలోపేతం అవుతారని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు..

# పర్యాటక ప్రగతిలో భాగస్వాములు అవ్వండి

### ఐటీ సంస్థలకు ఉప ముఖ్యమంత్రి భట్టి పిలుపు

### ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం

తెలంగాణలోని ప్రకృతి అందాలకు మరింత ప్రాచుర్యం కల్పించడంతోపాటు పర్యావరణహిత పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ఐటీ సంస్థల తోడ్పాటు తీసుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో పలు ఐటీ కంపెనీల సీఈఓలు, ముఖ్య ప్రతినిధులతో శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజుతోపాటు అటవీ, పర్యాటకశాఖల ఉన్నధికారులు హాజరయ్యారు. వివిధ ఐటీ సంస్థల సీఈవోలు, ప్రముఖులు... రాజన్న(టీసీఎస్), కిరణ్ చెరుకూరి(హెచ్‌సీఎల్), చింతలపాటి శ్రీనిరాజు(ఐ ల్యాబ్స్), మమత మద్దిరెడ్డి(హెచ్ఎస్‌బీసీ), వినయ్ అగర్వాల్(టెక్ మహీంద్ర), రామ్‌కుమార్(జెన్‌ప్యాక్), చంద్రశేఖర్‌శర్మ(సీటీఆర్ఎల్ఎస్) తదితరులు పాల్గొన్నట్లు అటవీ శాఖ వెల్లడించింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ... "తెలంగాణలో ఎకో, ఫారెస్ట్, టెంపుల్ టూరిజం అభివృద్ధిలో ఐటీ సంస్థలు భాగస్వాములు కావాలి. ఐటీ ఉద్యోగులు వారాంతాల్లో కుటుంబాలతో కలిసి పర్యాటక ప్రాంతాల్ని సందర్శించేలా ప్రోత్సహించాలి. ప్రాణహిత–చేవెళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టులకు, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వులకు ప్రాచుర్యం కల్పించాలి. ఫ్యూచర్‌సిటీలో ఐటీ సంస్థలు, పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టాలి. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సులో భాగంగా దేశంలోని ప్రధాన నగరాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తాం" అని తెలిపారు.

ఇంటర్నెట్, సౌకర్యాల మెరుగుదల

అటవీ ప్రాంతాల్లో పర్యాటక సౌకర్యాల మెరుగుదల, ఇంటర్నెట్ కనెక్టివిటీ, డిజిటల్ వేదికల ద్వారా ప్రచారం చేయడం వంటి అంశాలపై ఐటీ సంస్థల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చించింది. తెలంగాణలోని ఎకో టూరిజం ప్రాజెక్టులు, ప్రకృతి అందాలు, పర్యాటక ఆకర్షణలు, సందర్శకులకు అందుబాటులో ఉన్న అవకాశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఐటీ కంపెనీల ప్రతినిధులకు అటవీశాఖ వివరించింది. ఈ సమావేశంలో అటవీ సంరక్షణ ప్రధాన అధికారి(పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్) వినయ్ కుమార్, సీసీఎఫ్‌లు శరవణన్, ప్రియాంక వర్గీస్, క్షితిజ, పర్యాటకశాఖ డైరెక్టర్ రంజిత్‌నాయక్ పాల్గొన్నారు.






కేపీహెచ్‌బీ కాలనీలో రోడ్డు ఆక్రమణలపై సిఎంసి చర్యలు..

- పోలీసు భద్రత నడుమ ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు..
- ప్రజల ఫిర్యాదులకు స్పందించి.. ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక డ్రైవ్.
- జేసీబీలతో ఆక్రమణలు తొలగింపు..పోలీసు భద్రత నడుమ ఫుట్‌పాత్‌లు క్లియర్..
- మళ్లీ ఆక్రమణలు జరగకుండా నిరంతర నిఘా అవసరం..!

## జేసీబీలతో స్పెషల్ డ్రైవ్..

ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రమ్య గ్రౌండ్ ప్రధాన రహదారిపై రోడ్డును ఆక్రమించి నిర్మించినట్లు గుర్తించిన కట్టడాలను జేసీబీల సహాయంతో తొలగించారు. రహదారిపైకి విస్తరించిన ఆక్రమణలతో పాటు ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన నిర్మాణాలను కూడా తొలగించే చర్యలు చేపట్టారు. పోలీసు భద్రత నడుమ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూల్చివేతల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది సహకరించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఆక్రమణల తొలగింపు కార్యక్రమం కొనసాగింది..

# కేపీహెచ్‌బీలో రోడ్డు ఆక్రమణలపై..

# సిఎంసి కొరడా..!

## కమిషనర్ ఆదేశాలతో రమ్య గ్రౌండ్ ప్రధాన రహదారిపై కూల్చివేతలు..




**శ్రీకాంత్ గౌడ్.. కూకట్‌పల్లి, పెన్ పవర్, అక్టోబర్ 9:** రోడ్డు ఆక్రమణలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు చెక్ పెట్టే దిశగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. సిఎంసి కమిషనర్ ఆదేశానుసారం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) కాలనీలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో రమ్య గ్రౌండ్ ప్రధాన రహదారిపై రోడ్డును ఆక్రమించి నిర్మించినట్లు గుర్తించిన షాపుల వద్ద కట్టడాలను జేసీబీల సాయంతో తొలగించారు. పోలీసు భద్రత నడుమ రహదారులతో పాటు ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.. అధికారుల చర్యలతో రహదారులు, ఫుట్‌పాత్‌లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తూ హర్షం వ్యక్తం చేశారు..కేపీహెచ్‌బీ కాలనీలోని రమ్య గ్రౌండ్ ప్రధాన రహదారిపై షాపుల వద్ద ఆక్రమణల కారణంగా వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, ఫలితంగా నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. రహదారుల ఆక్రమణల తోపాటు ఫుట్‌పాత్‌లు కూడా ఆక్రమణలకు గురవడంతో పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితులు ఏర్పడి, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఫిర్యాదులు అందాయి.. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలకు ఉపక్రమించారు..

## ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం లభించేనా..?

ప్రధాన రహదారులపై ఆక్రమణల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రద్దీ సమయాల్లో ట్రాఫిక్ నెమ్మదించడం, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల కారణంగా పాదచారులు సైతం రోడ్డుపై నడవాల్సి వస్తోందని, దీనివల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు చర్యలు ప్రజలకు ఊరటనిస్తాయని భావిస్తున్నారు..




పోలీసుల భద్రతతో కూల్చివేతలు..

## తాత్కాలిక చర్యలు కాదు..
## నిరంతర పర్యవేక్షణ అవసరం..

ఆక్రమణల తొలగింపుతోనే సమస్య పూర్తిగా పరిష్కారం కాదని, భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఇతర ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లను కూడా పరిశీలించి ఆక్రమణలను గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రహదారులు వాహనాల రాకపోకలకు, ఫుట్‌పాత్‌లు పాదచారుల నడకకు మాత్రమే ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.. ప్రజల ఫిర్యాదులకు స్పందించి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్ ఆక్రమణల సమస్యపై యంత్రాంగం దృష్టి సారించినట్లు స్పష్టం చేస్తోంది. ఇదే తరహా చర్యలను నిరంతరం కొనసాగించి, రహదారులపై ఆక్రమణలు పునరావృతం కాకుండా చూడటంతో పాటు ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.




ఆక్రమణలను కూల్చేస్తున్న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది..

# ప్రజలు తిరస్కరించిన ప్రతిసారీ వ్యవస్థలపై రాహుల్ ఆరోపణలు

**కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

హైదరాబాద్ పెన్ పవర్: ప్రజలు వారిని తిరస్కరించిన ప్రతిసారి వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించడం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి పార్టీలకు అలవాటుగా మారిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్ నుంచి అస్సాం వరకు, పుదుచ్చేరి నుండి రాజస్థాన్, త్రిపుర వరకు తీర్పు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. 'ఇండి' కూటమిలా అబద్ధాలు, కల్పిత కథల్లా కాకుండా.. ప్రధాని మోదీ నాయకత్వంపై భారత ప్రజలకు నమ్మకం ఉందని సంజయ్ పేర్కొన్నారు.

ప్రజలు ప్రచార రాజకీయాలకు, పనితీరు రాజకీయాలకు మధ్య తేడాను చూడగలుగుతున్నారు కాబట్టే భాజపా-ఎన్‌డీఏ కూటమి వరుస విజయాలు సాధిస్తున్నాయన్నారు.



# బౌరంపేట్ సర్వే నెం.578,580లో...
# అక్రమ నిర్మాణాలు



బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలు

- 2022 జూన్‌లో కూల్చినచోటే..! 2026 అక్టోబర్‌లో మళ్ళీ కబ్జాలు..
- తాజాగా దాదాపు 6 బేస్మంట్‌లు- 2 గదుల నిర్మాణం.. అంతా బహిరంగమే..!
- పట్టపగలే అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కబ్జాదారులు..

బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు కబ్జా అయ్యేవరకు, రెవెన్యూ చర్యలు ఉండవా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. ప్రభుత్వ భూముల పరిరక్షణ, భూ కబ్జాల నియంత్రణకు, ప్రభుత్వం కొత్తగా "జిపివో"లను నియమించినట్లు దుండిగల్ తహశీల్దార్ బాధ్యతలు చేపట్టిన సమయంలో గొప్పలు చెప్పారు.. 'ఆర్ఐ'లు ఉండనే ఉన్నారని అన్నారు.. రెవెన్యూ సిబ్బంది ఎంతమంది ఉన్నా..! విధుల్లో పారదర్శకత, చర్యలు చేపట్టడంలో నిజాయితీని ప్రదర్శించాలని వ్యంగ్యారోపణలు చేస్తున్నారు.. ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ లేఅవుట్ పేరుతో, పేదల పాత పట్టాలకు ప్రాధాన్యత ఇచ్చారు సరే.. ఎలాంటి అనుమతులు లేకుండా 5 అంతస్తులు అక్రమంగా నిర్మిస్తుంటే, పేదల నిర్మాణాలుగానే భావించాలా..? 120 గజాల్లో ప్రమాదకర అంతస్తులు ఎలా సాధ్యం..? ఇదిలా ఉండగా బౌరంపేట్ సర్వే నెంబర్ 578, 580 ప్రభుత్వ భూమిలో తాజాగా వెలుస్తున్న, మూకుమ్మడి అక్రమ నిర్మాణాలు రెవెన్యూ అధికారులకు తెలియకుండా సాధ్యమేనా..? అన్న ప్రశ్నలు లేవనెత్తుతోంది..

- ప్రభుత్వ భూమిలో.. ఏళ్ళు గడుస్తున్నా కొద్ది..! మారుతున్న భూ సమీకరణాలు..
- కబ్జాలపై వరుస కథనాలు..అయినా చీమ కుట్టినట్టు లేదంటే..?రక్షకులా..బక్షకులా..?
- గతంలో పాత ప్రభుత్వ పట్టాలకు దుండిగల్ రెవెన్యూ అధికారుల బహిరంగ సహకారం..
- నాడు బీఆర్ఎస్..! నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏదైనా..! 'కబ్జాలు-సిఫార్సులు' కామన్..!
- దుండిగల్ గండిమైసమ్మ మండలంలో జవాబుదారీ తనానికి చెక్..
- సమాధానం చెప్పలేక ఫోన్‌లు బ్లాక్ చేసే తహశీల్దార్ సారు.. దీనికి మీ సమాధానం..?
- తిలాపాపం..తలా పిడికెడుగా బౌరంపేట్, 578, 580, భూముల పంపకమా..?
- ఇందిరమ్మ కాలనీ ఆనుకొని ఉన్న 580 ప్రభుత్వ భూమిలో కొత్తగా మళ్ళీ కబ్జాలు..
- సుమారు రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూమిలో అక్రమార్కుల నూతన వెంచర్..
- అధికారుల బరితెగింపు విధులతో..ప్రభుత్వ భూములు పరాధీనం..
- ఖాళీస్థలాలు కనిపిస్తే కబ్జాలేనా..! ఈ నిర్మాణాలకు ఏ పట్టాలు ఉన్నాయో..?



2022 జూన్ 20న(4 ఏళ్ళక్రితం) నిర్మాణాలకు సిద్దంగా ఉంచిన ఇటుకలు..(ఫైల్‌ఫొటో)



2022 జూన్ 20న కబ్జాకు చదును చేసిన ప్రభుత్వ స్థలం..(ఫైల్‌ఫొటో)

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 9:**
మేడ్చల్ జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండల పరిధిలోని బౌరంపేట ఇందిరమ్మ కాలనీ సర్వే నెంబర్. 578, 580 ప్రభుత్వ భూమిలో సుమారు 4 ఏళ్ళక్రితం (2022 జూన్ 20న) జేసిబితో చదును చేసి దర్జాగా గదుల నిర్మాణం చేపడుతుండగా పత్రికల్లో వార్తలు వచ్చిన వెంటనే, అప్పటి రెవెన్యూ అధికారులు చేపట్టిన తక్షణ చర్యల్లో భాగంగా, కబ్జా పనులు నిలిచి పోయాయి.. ఇందిరమ్మ అపార్ట్మెంట్‌ల చాటు ఉండటంతో, గత 2-3 రోజులుగా దాదాపు 8-9 అక్రమ నిర్మాణాలు వెలిసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.. అయితే ఇందులో సుమారు 6 బేస్మంట్‌లు, 2 గదులు రేకుల వరకు నిర్మాణం చేపట్టినట్టు తెలుస్తోంది.. వార్తలు వచ్చినా.. దృష్టికి తీసుకెళ్ళినా.. దుండిగల్ రెవెన్యూ అధికారుల తీరు.. చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందంగా ఉందనే విషయం తెలిందేనని విమర్శలు వినిపిస్తున్నాయి.. ఇంత జరుగుతున్నా, ఈ అక్రమ కట్టడాల వ్యవహారం, సంబంధిత రెవెన్యూ అధికారులకు తెలియకుండా, జరిగే పనేనా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. రూ. కోట్లు విలువచేసే ప్రభుత్వ భూముల పట్ల రెవెన్యూ అలసత్వంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

## ఇందిరమ్మ ఇళ్ళవద్ద.. అక్రమ నిర్మాణాలు..

బౌరంపేట ఇందిరమ్మ కాలనీ సర్వే నెంబర్ 578, 580 ప్రభుత్వ భూమిలో, దర్జాగా పట్టపగలే అక్రమ నిర్మాణాలు చేపట్టి రియల్ ఎస్టేట్ దందాలు కొనసాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. బౌరంపేట ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2 వద్ద సర్వే నెంబర్ 578, 580లో ఇందిరమ్మ గృహాలను ఆనుకుని ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో దాదాపు 4 సంవత్సరాల క్రితం(2022 జూన్ 20న) భారీగా అక్రమ నిర్మాణాలకు తెరలేపారు.. దీంతో 2022 జూన్ 21న 'పెన్ పవర్' దినపత్రికలో అక్రమ నిర్మాణాలకు సిద్ధం చేసిన విషయమై వార్తను ప్రచురించడంతో అప్పటి తహశీల్దార్ ఆదేశాలతో, రెవెన్యూ అధికారులు పనులు నిలిపివేసి నాలుగేళ్ళు గడిచింది..

## అదేచోట తాజాగా అక్రమ కట్టడాలు..

బౌరంపేట్ సర్వే నెం.578, 580 ప్రభుత్వ భూమిలో, 4 ఏళ్ళుగా సైలెంట్‌గా అక్రమార్కులు, 2-3 రోజులుగా కొన్ని బేస్మంట్‌లు, రెండు గదులు నిర్మించడం వివాదాస్పదంగా తయారైంది.. అయితే నిర్మాణాలు ఎవరు నిర్మిస్తున్నారు అనే విషయం రెవెన్యూ అధికారులే తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.. రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమి పరిరక్షణలో భాగంగా, అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.. ఏ ప్రభుత్వ పట్టాలు జారీచేయని ఈ సర్కారు భూమిలో చర్యలు చేపడతారా.. రాజకీయ నాయకుల సిఫార్సుల పేరుతో, కబ్జాలకు వదిలేస్తారో వేచిచూడాలి.. కబ్జాలకు వేదికైన బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో ఈ అక్రమ నిర్మాణాలపై అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



మరికొన్ని గదుల నిర్మాలకు సిద్ధంగా ఉన్న బేస్మంట్‌లు..


బహుదూర్‌పల్లి 131 ప్రభుత్వ భూమిలో 2023 మార్చి 9న రెవెన్యూ కూల్చివేత..(ఫైల్‌ఫొటో)


నాడు 131లో కూల్చేసిన అదేచోటును ప్రస్తుతం (2026) దర్జాగా పట్టాభూమిగా..

# దుండిగల్ రెవెన్యూ నిర్లక్ష్యానికి నిదర్శనాలు..?


GOVERNMENT OF TELANGANA
(REVENUE DEPARTMENT)

Office of the Tahsil,
Gandimaisamma-Dundigal Mandal.

Dated:07.05.2024.

No.B/528/2024

NOTICE UNDER SECTION 7 OF
A.P. LAND ENCROACHMENT ACT III OF 1905

To
Kum. Gaddam Sahiti Reddy D/o. G.Surender Reddy

Whereas you are reported to be un-authorized occupation of the land specified in the scheduled below, which is the property of Government. You are hereby given notice that if you desire so you may, before 2 days show cause either in person or in writing before me/the Collector why you should not addition to the full assessment on the land under section (3) (1) of the Act to the rate prescribed by or under section 3 (ii) of the act to charged a penalty for such occupation under section 5 of Act III of 1905 or and be subjected to eviction from the land and things deposited there on under section 6 of the said Act.

| Name of Village | Sy. No. and Sub-Division | Description of land | Total extent Ac-gts., | Encroached extent Ac-gts., | Nature of Occupation |
|---|---|---|---|---|---|
| Bahadurpally | 227 | Poramboke | 353-35 | 400 sq.yds (approx) | (01) Shed |

In view of the above the Girdawar of this office are directed to service and to return the served copy.

Tahsildar,
Gandimaisamma-Dundigal Mandal.

అక్రమ షెడ్డుకు తహశీల్దార్ ఇచ్చిన నోటీసు..

- ఉన్నతాధికారుల జోక్యం ఉండదు.. ఉన్న అధికారులకు బాధ్యత ఉండదు..
- కరప్షన్ టీమ్ కనుసన్నల్లో ప్రభుత్వ భూములు కనుమరుగు..?
- బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలోనూ నిరంతర కబ్జాల పర్వం..
- 227లో బౌరంపేట్ రోడ్డుకు దర్జాగా కంటైనర్ లతో ప్రభుత్వ భూమి ఆక్రమణలు..
- 2024 మే 7న నోటీసులు ఇచ్చిన సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డుపై నేటికీ చర్యలు శూన్యం..
- బహుదూర్‌పల్లి 131లో 2023 కూల్చేసిన స్థలాన్ని.. 2026లో పట్టాభూమిగా అప్పగింత..
- మల్లంపేట్ 'జిఎల్‌సి'లో అదనపు ప్రభుత్వ భూమిని స్వాధీన పర్చుకోవడంలో విఫలం..

శివుడి ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదు అంటారు.. మరి ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల వ్యవహారం సంబంధిత అధికారులకు, సిబ్బందికి తెలియకుండా సాధ్యమేనా..? అన్న ప్రశ్నలు కీలకంగా వినిపిస్తున్నాయి.. గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో ఆర్‌ఐ రవికుమార్ కూల్చేసిన అక్రమ షెడ్డుల్నీ నిర్మించినా..! నేటికి చర్యల్లేవు..! అదే భూదాన్ భూమిలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు డి-నోటిఫికేషన్‌తో 22-ఎ నిషేధిత జాబితాలో పెట్టినా, ఓ ప్రజాప్రతినిధి బంధువులకు చెందిన, 2 భారీ అక్రమ షెడ్లపై చర్యలు తీసుకోకుండా, సహకరించడం సిఫార్సులు ఉన్నాయని బాధ్యత, రాహిత్యంగా వ్యవహరించడం గమనార్హం.. మరోవైపు ఈ షెడ్లకు భారీ మొత్తంలో ముడుపులు ముట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి..


బహుదూర్‌పల్లి 227లో సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డు.

'నో' ట్రాన్స్‌ఫార్మర్


గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో ఏడాదిన్నర క్రితం.. కూల్చేసిన అక్రమ షెడ్డు..(ఫైల్‌ఫొటో)

కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్


భూదాన్ భూమిలో కూల్చేసిన అక్రమ షెడ్డును మళ్ళీ ఇలా నిర్మించిన వైనం.. (ప్రస్తుత ఫొటో)

# హుస్సేన్ సాగర్ టూ ప్రకాశం బ్యారేజ్ సీప్లేన్

**హైదరాబాద్, అక్టోబరు 9 పెన్ పవర్:** హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నీటిపై విమానం వేగంగా దూసుకెళ్లి ఆకాశంలోకి ఎగరడం, క్షణాల్లో కృష్ణా తీరానికి చేరుకుని విజయవాడ ప్రకాశం బ్యారేజీ జలాల్లో ల్యాండ్ అవ్వడం.. వినడానికే ఎంతో అద్భుతంగా అనిపించే ఈ ఊహ త్వరలోనే నిజరూపం దాల్చేలా కనిపిస్తోంది. ఇప్పటివరకు హైదరాబాద్-విజయవాడ నగరాల మధ్య నిత్యం వేలాది మంది ప్రయాణికులు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శంషాబాద్-గన్నవరం విమాన సర్వీసులపై ఆధారపడుతున్నారు. అయితే, సాధారణ రవాణా వ్యవస్థకు పూర్తి భిన్నంగా, ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సాగే అత్యాధునిక సీప్లేన్ సేవలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈ సర్వీసులు ప్రారంభమైతే ప్రయాణ సమయం ఆదా కావడమే కాకుండా, తెలుగు రాష్ట్రాల పర్యాటక రంగానికి ఊహించని సరికొత్త ఊపు లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా సాహసోపేత, జల పర్యాటకాన్ని ఇష్టపడే దేశ, విదేశీ పర్యాటకులకు ఇదొక అద్భుతమైన అనుభూతిని అందిస్తుందనడంలో సందేహం లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యతనిస్తూ, నూతన పర్యాటక పాలసీని రూపొందించి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రితో భేటీ అయినప్పుడు హుస్సేన్‌సాగర్-ప్రకాశం బ్యారేజీల మధ్య సీప్లేన్ సేవల నిర్వహణ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సమావేశం అనంతరం ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే ప్రక్రియ ఊపందుకుంది. దీనిలో భాగంగా భారత విమానాశ్రయాల సంస్థ (ఏఏఐ)కి చెందిన ఉన్నతాధికారుల ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో సమగ్ర అధ్యయనం చేపట్టింది. రాష్ట్ర పర్యాటకశాఖ, హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఉన్నతాధికారులతో కలిసి ఏఏఐ ప్రతినిధులు హుస్సేన్‌సాగర్‌లోని వివిధ ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. జల విమానాలు సురక్షితంగా నీటిపై దిగేందుకు (ల్యాండింగ్), పైకి ఎగిరేందుకు (టేకాఫ్) అవసరమైన నీటి లోతు, ఉపరితల వైశాల్యం, ప్రవాహ వేగం వంటి సాంకేతిక అంశాలను లోతుగా లెక్కించారు. దీంతోపాటు విమానం నీటిపై ప్రయాణించే మార్గం (ట్యాక్సీ పార్క్), ప్రయాణికులు ఎక్కేందుకు మరియు దిగేందుకు వీలుగా జెట్టీలు, ప్యాసింజర్ టెర్మినల్ సదుపాయాలు ఎక్కడ ఏర్పాటు చేయవచ్చనే అంశాలపై

సమగ్ర పరిశీలన జరిపారు. హుస్సేన్‌సాగర్‌లో చేపట్టిన క్షేత్రస్థాయి తనిఖీలకు సంబంధించిన అన్ని సాంకేతిక, పర్యావరణ వివరాలతో ఏఏఐ నిపుణుల బృందం త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికను (డీపీఆర్ రూపంలో) సమర్పించనుంది. ఈ నివేదిక ఆధారంగా ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు, నిధుల కేటాయింపు, ఏజెన్సీల ఎంపికపై కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

- పండుగకు ముందే అపచారం.. బతుకమ్మ తల్లీ, కూతుళ్ల విగ్రహాల ధ్వంసం..!
- శిలాఫలకాన్నీ వదలని దుండగులు.. గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం..!
- బతుకమ్మ సంబరాల వేళ ఈ దుశ్చర్య.. స్థానికుల్లో ఆందోళన..!
- దంతాలపల్లి పోలీసులకు ఫిర్యాదు.. రంగంలోకి దిగిన పోలీసులు..!
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ రవికుమార్.. కేసు నమోదు..!
- ధ్వంసం వెనుక అసలు కారణాలేంటి..? నిందితులెవరో తేల్చేందుకు దర్యాప్తు..!

దాట్ల గ్రామంలోని "బతుకమ్మ తల్లీ, కూతుళ్ల విగ్రహం..(ఫైల్‌ఫొటో)



దుండగులు ధ్వంసం చేసిన బతుకమ్మ తల్లీకూతుళ్ల విగ్రహాలు.. (ప్రస్తుతం)





ధ్వంసంమైన శిలా పలకం ముక్కలు..

# బతుకమ్మ పండుగ వేళ.. దుండగుల విధ్వంసకాండ..!

## దంతాలపల్లి మండలం దాట్లలో బతుకమ్మ విగ్రహాలు, శిలాఫలకం ధ్వంసం..



ధ్వంసం చేసిన విగ్రహాన్ని, శిలాపలకాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ.రవికుమార్..

**పడిదం రమేష్.. దంతాలపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 9:** బతుకమ్మ పండుగ సమీపిస్తున్న వేళ బతుకమ్మ తల్లీ, కూతుళ్ల విగ్రహాలతో పాటు శిలాఫలకాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో కలకలం రేపింది. దంతాలపల్లి మండలం దాట్ల గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికుల ఆగ్రహానికి కారణమైంది. పండుగ సందర్భంగా విగ్రహాలను రంగులతో అలంకరించి వేడుకలకు సిద్ధం కావాల్సిన సమయంలో ఈ విధ్వంసం జరగడం పట్ల గ్రామస్థులు తీవ్ర ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండుగకు ముందు ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. ఈ నేపథ్యంలో, ఈ చర్యకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. గ్రామస్థులు ఈ ఘటనపై దంతాలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. విగ్రహాలు, శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం వెనుక అసలు కారణాలేమిటి..? ఈ ఘటనకు పాల్పడిన వారెవరు..? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. రాజకీయ పార్టీల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలోనూ గ్రామంలో చర్చ జరుగుతున్నప్పటికీ, దీనిపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ధారణ కాలేదు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు..



దాట్ల గ్రామస్తులతో కలిసి ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ.రవికుమార్..

---

## భాగ్యనగరంలో బడా మోసగాళ్లు

# 54 మందికి ఒకే ఇల్లు అమ్మకం

**హైదరాబాద్, అక్టోబరు 9 పెన్ పవర్: :** హైదరాబాద్ నగరంలో ఆస్తి మోసాల ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ పుంజుకోవటం, నగరంలో ప్రాపర్టీలకు డిమాండ్ పెరగటంతో మోసాలు కూడా ఎక్కువవుతున్నాయి. తాజాగా.. ఒకే భవనాన్ని 54 మందికి విక్రయించి, తాకట్టు పెట్టి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసిన వ్యవహారం బయటపడగా.. మరోచోట ప్రభుత్వ అధికారుల సంతకాలు, కార్యాలయాల సీళ్లు ఫోర్జరీ చేసి నకిలీ ఆస్తి పత్రాలు సృష్టించిన ముఠా గుట్టు రట్టయింది. ఇంకోవైపు ఖాళీగా ఉన్న భూములను గుర్తించి నకిలీ యజమానులను సృష్టించి విక్రయించేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మూడు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేయగా.. పలువురు నిందితులు పరారీలో ఉన్నారు. నకిలీ పత్రాలతో ఆస్తి మోసాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని మల్కాజిగిరి సీపీ బి.సుమతి హెచ్చరించారు.మాదన్నపేట దారాబ్‌జంగ్ కాలనీలో గ్రౌండ్ ఫ్లోర్, రెండు అంతస్తులు, పెంట్‌హౌస్ ఉన్న భవనం రషాద్ ఉల్ ఖైర్, ముంతాజ్‌బేగం ఆధీనంలో ఉంది. దాన్ని వివిధ వ్యక్తులకు ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించేందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు. బ్రోకర్ల ద్వారా ప్రచారం చేయడంతోపాటు, నమ్మకం కలిగించేందుకు పెంట్‌హౌస్‌లో ఉంటున్న అస్మాబేగంను కిరాయిదారుగా చూపించారు. కొందరికి కొంతకాలం అద్దె కూడా చెల్లించారు. 2021 మార్చి నుంచి ఈ ఏడాది జూన్ వరకు 54 మంది నుంచి సుమారు రూ.4.5 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. రూ.15 లక్షలు నష్టపోయిన నయీం బాను ఫిర్యాదుతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అస్మాబేగంను అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.మరో కేసులో డాక్యుమెంట్ రైటర్ దేవగుప్తపు వీర వెంకట సత్యనారాయణ, అతని మాజీ డ్రైవర్ పోలె రాజుతో కలిసి సుమారు ఎనిమిదేళ్లుగా నకిలీ ఆస్తి పత్రాల దందా సాగించినట్లు పోలీసులు గుర్తించారు. జీపీఏ, ఎస్‌పీఏ, సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, మార్టేజ్ రిలీజ్ వంటి పత్రాలతోపాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారుల సంతకాలు, నకిలీ స్టాంపులు ఉపయోగించినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లోని విలువైన స్థలాలకు సంబంధించిన నకిలీ పత్రాలను తయారు చేసినట్లు వెల్లడించారు. ఎల్బీనగర్‌లోని ఓ ఫ్లాట్‌పై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు 25 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు, 41 నకిలీ రబ్బరు స్టాంపులు, పలు ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# టీబీ రహిత పంచాయతీగా మద్దివంచకు జాతీయ పురస్కారం



సర్పంచ్ ను సన్మానిస్తూ అవార్డు ప్రధానం చేస్తున్న జిల్లా క్షయ నియంత్రణ అధికారి అజ్మీరా అర్జున్

**గార్ల, పెన్ పవర్, అక్టోబర్: 9** మహబూబాద్ జిల్లా గార్ల మండలంలోని మద్దివంచ గ్రామ పంచాయతీకి టీబీ ముక్త్ పంచాయతీ జాతీయ పురస్కారం లభించింది. గ్రామంలో గత రెండేళ్లుగా ఒక్క క్షయ వ్యాధి కేసు కూడా నమోదు కాకపోవడంతో ఈ గుర్తింపు దక్కింది. ఈ మేరకు గ్రామ సర్పంచ్ గుగులోత్ ప్రమీల పురస్కారాన్ని అందుకున్నారు. మహబూబాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ (ఐడీఓసీ)లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు సర్పంచ్‌ను సన్మానించారు. గ్రామంలో క్షయ వ్యాధి నివారణకు చేపట్టిన చర్యలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అజ్మీరా అర్జున్, గార్ల ఎంపీడీవో మంద మంగమ్మ, ఎంపీవో ఒడ్దూరి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రహిత పంచాయతీగా మద్దివంచకు జాతీయ పురస్కారం



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ హనుమంతరావు

**గార్ల, పెన్ పవర్, అక్టోబర్: 9** మహబూబాద్ జిల్లా గార్ల మండలంలోని మద్దివంచ గ్రామ పంచాయతీకి టీబీ ముక్త్ పంచాయతీ జాతీయ పురస్కారం లభించింది. గ్రామంలో గత రెండేళ్లుగా ఒక్క క్షయ వ్యాధి కేసు కూడా నమోదు కాకపోవడంతో ఈ గుర్తింపు దక్కింది. ఈ మేరకు గ్రామ సర్పంచ్ గుగులోత్ ప్రమీల పురస్కారాన్ని అందుకున్నారు. మహబూబాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ (ఐడీఓసీ)లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు సర్పంచ్‌ను సన్మానించారు. గ్రామంలో క్షయ వ్యాధి నివారణకు చేపట్టిన చర్యలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అజ్మీరా అర్జున్, గార్ల ఎంపీడీవో మంద మంగమ్మ, ఎంపీవో ఒడ్దూరి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష



**ఎల్బీనగర్, పెన్ పవర్ అక్టోబర్ 9:** బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వారికి శిక్ష పడేలా, బాధితులకు న్యాయం జరిగేలా నాగోల్ పోలీసులు సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టారు. బాలికపై లైంగిక నేరానికి సంబంధించిన పోక్సో కేసులో పటిష్టమైన దర్యాప్తు నిర్వహించి, న్యాయస్థానంలో కీలక ఆధారాలను సమర్పించారు. దీంతో న్యాయస్థానం నిందితుడు గుంజి కోటేశ్వరరావుకు 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.17 వేల జరిమానా విధించింది. అలాగే బాధిత బాలికకు రూ.2 లక్షల పరిహారం మంజూరు చేసింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసి, బాధితురాలికి న్యాయం అందించడంలో అంకితభావంతో పనిచేసిన నాగోల్ పోలీసులను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి అభినందించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం జరిగేలా పోలీసులు కృషి చేస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఆటోనగర్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం



**ఎల్బీనగర్, పెన్ పవర్, అక్టోబర్ 9:** వాహనదారుల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు వనస్థలిపురం పోలీసుల ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలను పాటించడం, వాహనాలను జాగ్రత్తగా నడపడం, రహదారి ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో వనస్థలిపురం సీఐ రవిబాబు, ఎస్ఐలు అనిల్ కుమార్, మల్లయ్య, ట్రాఫిక్ ఎస్ఐ నర్సిరెడ్డి, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం.. మిస్సింగ్ కేసు నమోదు



అదృశ్యమైన యువతి జస్మిత

**గార్ల, పెన్ పవర్, అక్టోబర్: 9** గార్ల మండల పరిధిలోని బిఆర్ఎన్ తండా గ్రామానికి చెందిన జస్మిత( 18) అనే యువతీ అదృశ్యమైనట్లు గార్ల ఎస్సై సాయి కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం. బిఆర్ఎన్ తండా గ్రామానికి చెందిన ధారావత్ సైదులు కూతురు జస్మిత గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతుంది ఈనెల 7.వ తారీకు బుధవారం రాత్రి ఇంట్లో చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయిందని చుట్టుపక్కల బంధువుల ఇళ్లలో వాకాబు చేసిన ఆచూకీ లభించకపోవడంతో బుద్ధారం గ్రామపంచాయతీ కంసాలి తండాకు చెందిన బానోతు శశిధర్ అనే వ్యక్తి తన కుమార్తె జస్మితను తీసుకుపోయాడనే అనుమానం ఉన్నదని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# అల్లిపురంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి ఘనంగా ఏర్పాట్లు

భక్తిభావంతో శంకుస్థాపన కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించాలి: మంత్రి తుమ్మల సూచన



**ఖమ్మం, పెన్ పవర్ అక్టోబర్ 9:** ఖమ్మం: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా అల్లిపురం వద్ద నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్లపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ సోమవారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్న నేపథ్యంలో, కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.

**దేవదేవుని ఆశీస్సులతో ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణం**

దేవదేవుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ఖమ్మంలో ఆలయ నిర్మాణం చేపట్టడం ఎంతో ఆనందకరమైన విషయమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌తో పాటు ఖమ్మంలోనూ రెండు ప్రాంతాల్లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఖమ్మంలో నిర్మించనున్న ఆలయానికి సంబంధించిన నిర్మాణం, నిర్వహణ బాధ్యతలు తిరుమల తిరుపతి దేవస్థానానివేనని వెల్లడించారు.

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు**

ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని మంత్రి సూచించారు. భక్తుల వాహనాల పార్కింగ్, భోజన వసతి, లడ్డూ ప్రసాదం పంపిణీతో పాటు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, దేవాదాయ శాఖలతో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. కార్యక్రమ నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి శాఖకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. శంకుస్థాపనకు సంబంధించి నిర్వహించే పూజా కార్యక్రమాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, భక్తుల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా శంకుస్థాపన**

త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి చేతుల మీదుగా నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని మంత్రి తుమ్మల సూచించారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. శ్రీవారి ఆలయ నిర్మాణంతో ఖమ్మం ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ మరింత పెరగనుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యుత్ షాక్‌తో ఆరిపోయిన యువతి జీవితం.. తల్లిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులకు తీరని లోటు.. బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**విద్యుత్ షాక్‌తో యువతి మృతి.. ఇద్దరు చిన్నారులకు తీరని లోటు**

**మృతురాలి భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి**



**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్ 9 :** ఏదులాపురం మున్సిపాలిటీ: విద్యుత్ షాక్ రూపంలో మృత్యువు కబళించడంతో ఓ యువతి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇద్దరు చిన్నారులకు తీరని శోకాన్ని మిగిల్చింది. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డుకు చెందిన చల్ల ఉపేందర్ భార్య చల్ల కవిత (26) శుక్రవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. చిన్న వయసులోనే తల్లి దూరం కావడంతో ఇద్దరు కుమార్తెల భవిష్యత్తుపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బాధిత కుటుంబానికి అండగా తుంబూరు దయాకర్‌రెడ్డి**

కవిత మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి మృతురాలి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతి అకాల మరణం తనను తీవ్రంగా కలచివేసిందని, ఇద్దరు చిన్నారులు తల్లిని కోల్పోవడం ఎంతో బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబ పరిస్థితిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా అవసరమైన సహాయం అందించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.

**నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు**

ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంపటి సురేష్, యర్ర శేఖర్, రామిశెట్టి రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు గుర్రం రాకేష్‌రెడ్డి, గంగారపు యాదగిరి, ఏపూరి తరుణ్, వడ్లకొండ భుజంగరావు, పొన్నెకంటి రమేష్, మల్లయ్య, బొర్రయ్య, రాము తదితరులు పాల్గొన్నారు. మృతురాలికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.





## ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న పాఠశాల ఉపాధ్యాయులు

**గార్ల, పెన్ పవర్, అక్టోబర్: 9** గార్ల మండల కేంద్రంలోని స్థానిక విశ్వశాంతి విద్యాలయం లో యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ పసుపులేటి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన బతుకమ్మ సంబరాలలో కరస్పాండెంట్ వడ్లమూడి దుర్గాప్రసాద్, బీరవెల్లి సంజీవరెడ్డి, ప్రవీణ్ రెడ్డిలు ముఖ్య అతిధులుగా పాల్గొని పాల్గొని బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. పాఠశాల ఆవరణంలో ముగ్గుల తో రంగవల్లి వేసి మధ్యలో బతుకమ్మలను పేర్చి తెలంగాణ బతుకమ్మ పాటలతో విద్యార్థుల కలిసి ఉపాధ్యాయురాలు చుట్టూ తిరుగుతూ కోలాటాలు నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైనా పండగలలో బతుకమ్మ పండుగ మహిళలకు అత్యంత ప్రీతి ప్రాప్త మైనా పండుగని దేవుడికి సమర్పించి పూజించే పూలను బతుకమ్మలుగా పేర్చి పూజించే విశిష్టమైన సంప్రదాయం తెలంగాణలోజరుపుకుంటామని, అనాదిగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాన్ని విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో కళాశాల ఉపాధ్యాయులు

**గార్ల, పెన్ పవర్, అక్టోబర్: 9** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను గార్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వేముల రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి. రాజకుమారి మాట్లాడుతూ పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చాంప్ల, ఏ. ప్రసాదరావు, , గొడుగు సోమన్న, జోగ్యానాయక్, టి. నాగేశ్వరరావు, డాక్టర్ యు. శ్రీనివాస్, జి. రాంబాబు, జి. సుజాత, వెంకటరమణ, రాకేష్, లక్మాలాల్, బాలకృష్ణ, తాజుద్దీన్, సత్యనారాయణ, ముత్తయ్యతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సీట్ల సర్దుబాటు ఎలా




**విజయవాడ, అక్టోబరు 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనున్న వేళ, అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల సర్దుబాటు అత్యంత సంక్లిష్టమైన ఘట్టంగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉండవల్లిలో సమావేశమై పొత్తులు, మేయర్, జెడ్పీటీసీ, చైర్‌పర్సన్ స్థానాల విభజనపై సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో అగ్రనేతలు ఇద్దరూ కలిసి ఒక నిర్ణయం తీసుకుంటే నియోజకవర్గ స్థాయి వరకు కేడర్ క్రమశిక్షణతో పనిచేసింది. కానీ, గ్రామీణ, పట్టణ స్థాయి పోలింగ్ బూత్‌ల వద్ద ముఖాముఖి తలపడే స్థానిక పోరులో కేవలం బాబు–పవన్‌ల భేటీలు,పిలుపులు కింది స్థాయి శ్రేణులను పూర్తిగా ఒకే తాటిపైకి తేగలవా అనేది ఇప్పుడు ఏపీ రాజకీయంలో అసలైన ప్రశ్న.శాసనసభ ఎన్నికల్లో 21 స్థానాల్లో పోటీ చేసి 100% స్ట్రైక్ రేట్ సాధించిన తర్వాతజనసేన కేడర్ ఆత్మవిశ్వాసం, ఆకాంక్షలు ఆకాశాన్ని తాకాయి. సార్వత్రిక ఎన్నికల సమయాన రాష్ట్ర ప్రయోజనాల కోసం 21 సీట్లకే పరిమితమయ్యామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం తమ ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వబోమని పవన్ కళ్యాణ్ తో పాటు జనసేన ముఖ్య నేతలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లోజనసేన గ్రాఫ్ బలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా ఇక్కడ వర్తించదని కేడర్ ఇప్పటికే తెగేసి చెబుతోంది. 30 శాతానికి పైగా స్థానాలు దక్కించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో సొంత నాయకత్వాన్ని బలపరుచుకోవాలని జనసేన పట్టుబడుతోంది.అటు తెలుగుదేశం పార్టీకి గ్రామీణ ఏపీలో ఐదు దశాబ్దాల బలమైన ఓటు బ్యాంకు, బూత్ స్థాయి బలగాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగావైఎస్సార్‌సీపీ వేధింపులు ఎదుర్కొని, స్థానికంగా పార్టీ జెండాను నిలబెట్టిన టీడీపీ గ్రామ స్థాయి నేతలు ఈసారి ఎలాగైనా పదవులు చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. చంద్రబాబు ఎన్ని సర్దుబాట్లు చెప్పినా.. తమకు దక్కాల్సిన సర్పంచ్, ఎంపీటీసీ లేదా కౌన్సిలర్ సీటును జనసేనకో, బీజేపీకో కేటాయిస్తే ఊరుకునే పరిస్థితి క్షేత్రస్థాయి టీడీపీ నేతల్లో లేదు. ఒకవేళ పార్టీ నుంచి అధికారికంగా బి–ఫామ్‌రాకపోయినా 'రెబెల్స్'గా అభ్యర్థులను దింపడానికో లేదా స్వతంత్రంగా పోటీ చేయడానికో స్థానిక టీడీపీ శ్రేణులు వెనుకాడేలా లేవు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ కూటమిలోని అసమ్మతిని అనుకూలంగామార్చుకోవడానికి వేచి చూస్తోంది. నియోజకవర్గ స్థాయిలో చంద్రబాబు, పవన్ ఎంత మైత్రిని ప్రదర్శించినా, పంచాయతీ, వార్డు స్థాయిలో కుటుంబాలు, పాత కక్షలు, వ్యక్తిగత ప్రాబల్యాలే గెలుపోటములనుశాసిస్తాయి. కూటమిలో సీటు దక్కని టీడీపీ లేదా జనసేన అసంతృప్త నేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తే ఓట్లు చీలిపోవడం ఖాయం. ఆ చీలిక ద్వారా తాము పుంజుకోవచ్చని వైఎస్సార్‌సీపీఆశిస్తోంది. ఈ రకమైన సాంప్రదాయ స్థానిక వైరుధ్యాలను అగ్రనేతలు పైస్థాయి నుంచి నియంత్రించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి.ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు చంద్రబాబు బలం ఉన్న చోట మిత్రపక్షానికే ప్రాధాన్యం అనే ఫార్ములాను ప్రతిపాదించారు. అయితే, ఒక నిర్దిష్ట పంచాయతీలో లేదా వార్డులో టీడీపీకి ఎక్కువ బలముందా, లేక జనసేనకు ఉందా అని తేల్చడం కత్తిమీద సాము లాంటిది.పార్టీ కమిటీల నిర్వహణ, ఉమ్మడి సర్వేలు, నామినేటెడ్ పదవుల హామీలతో అసంతృప్తిని చల్లార్చాలని బాబు–పవన్ ప్రయత్నిస్తున్నప్పటికీ, అధికారం తలుపు తడుతున్న వేళ పదవుల కోసం ద్వితీయశ్రేణి నేతల మధ్య పోటీ రాపిడికి దారితీస్తోంది. రాష్ట్రస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఐక్యత ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ, స్థానిక ఎన్నికలు అనేది పూర్తిగా కింది స్థాయి నాయకుల ఉనికి, భవిష్యత్తుకుసంబంధించిన అంశం. పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో చోటుచేసుకునే ఫ్రెండ్లీ ఫైట్లు లేదా తిరుగుబాట్లు ప్రధాన కూటమి ఐక్యతను దెబ్బతీయకుండా, కేడర్‌ను సమన్వయం చేయడమే అమరావతి పెద్దలకు రాబోయే రోజుల్లో అతిపెద్ద సవాలు కానుంది.

# ఏపీలో కొత్త పార్టీకి స్పేస్ ఉందా

**విజయవాడ, అక్టోబరు 9, పెన్ పవర్:** ఏపీ రాజకీయం ఎప్పుడూ వేడిమీదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఏపీ పొలిటికల్ స్క్రీన్‌పై సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. జడ శ్రవణ్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్, బీసీవై పార్టీ అధినేతరామచంద్ర యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, కేకే సర్వేస్ కొండేటి కిరణ్.. చివరికి వైఎస్సార్‌సీపీ నుంచి దూరమైన రాజ్యసభ మాజీఎంపీ విజయసాయిరెడ్డి వరకు కొత్త రాజకీయ వేదికలు, పార్టీలు లేదా స్వతంత్ర రాజకీయం వైపు ప్రయాణిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. అసలు ఏపీలో రాజకీయం అంటే అంత సింపుల్‌అయిపోయిందా? ప్రెస్ మీట్లు పెట్టడం, జెండా ఎగరేయడం, కొత్త పార్టీ అని ప్రకటించేయడం ఇంత సులువైన వ్యవహారమా? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్త పార్టీలస్థాపన వెనుక ప్రధానంగా మూడే మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది రిటైర్మెంట్ పొలిటికల్ అంబిషన్ , రెండోది సామాజిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలు , మూడోది ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక సొంత దుకాణం తెరవడం! కానీ, క్షేత్రస్థాయిలో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, దానిని జిల్లాల వారీగా, మండలాల వారీగా కేడర్‌తో నిర్మించడం, భారీ ఎత్తున ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం ఎంతసంక్లిష్టమైన విషయమో ఈ కొత్త నేతలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం టివి డిబేట్లు, సోషల్ మీడియా క్లిప్పింగులతో ఎన్నికల్లో నెగ్గుకురావచ్చనే భ్రమలోనే ఈ కొత్త పార్టీల హడావుడి సాగుతోంది.ఇక అసలైన ప్రశ్నకు వస్తే.. ఈ కొత్త రాజకీయ వేదికల్లో ఒక్కటైనా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్‌సీపీ లేదా కూటమిలో భాగమైన జనసేన ఓటు బ్యాంకును చీల్చగలదా? దీనికిసమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖాముఖి రాజకీయాలకు అలవాటుపడిన రాష్ట్రం. ఇక్కడ ఓటరు చాలా స్పష్టంగా అధికార–ప్రతిపక్షాల మధ్యే తన తీర్పును విభజిస్తాడు. గతంలో విపరీతమైన ప్రజాదరణ ఉన్న సినీ గ్లామర్, భారీ నిధులు ఉన్న చిరంజీవి , సుదీర్ఘకాలం పోరాడిన పవన్ కళ్యాణ్ ( కూడా ఓటు బ్యాంకును సీట్లుగా మార్చడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అటువంటిదిఎటువంటి కేడర్, స్పష్టమైన సిద్ధాంతం లేని ఈ చిన్న పార్టీలు ప్రధాన పార్టీల గట్టి ఓటు బ్యాంకును కదిలించడం దాదాపు అసాధ్యం.జడ శ్రవణ్ లేదా రామచంద్ర యాదవ్ వంటి నేతలు బిసి, దళిత సామాజికవర్గాల ఓట్లను ప్రభావితం చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, ఆయా సామాజిక వర్గాలు ఇప్పటికే సంక్షేమ పథకాలు, పొలిటికల్ రిజర్వేషన్ల ప్రాతిపదికన టీడీపీ–వైఎస్సార్‌సీపీల మధ్య స్పష్టంగా చీలిపోయి ఉన్నాయి. అలాగే రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైన ఏబీ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు లేదా సీనియర్ నేత విజయసాయిరెడ్డి వంటి వారు రాజకీయ వేదికలు పెట్టినా.. అవి కేవలం పట్టణ ప్రాంతమేధావులు, మీడియా రచ్చబండలకే పరిమితమవుతాయి తప్ప, గ్రామీణ పోలింగ్ బూత్‌లో ప్రభావం చూపే స్థాయికి వెళ్లలేవు. ఈ పార్టీల వల్ల ప్రధాన పార్టీలకు జరిగే ఒక్కే ఒక్క నష్టం.. ఓట్ల చీలిక ! హోరాహోరీ స్థానాల్లో ఈ చిన్న పార్టీలు లేదా స్వతంత్రులు చీల్చే కొన్ని వందల ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల జాతకాలను తలకిందులు చేసే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, బిసివై పార్టీ కొద్దిపాటి ఓట్లనుచీల్చినా, అది ఆ నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థి మార్జిన్‌పై ప్రభావం చూపుతుంది. అంటే ఇవి ఓడించే లేదా గెలిపించే బలం లేని పార్టీలే కానీ, వోట్ కట్టర్ గా మాత్రమే ఉపయోగపడతాయి.ఏపీలో కొత్తపార్టీల హడావుడి అనేది కేవలం తాత్కాలిక మీడియా ఆకర్షణ , నేతల వ్యక్తిగత ఉనికి కాపాడుకునే ప్రయత్నం మాత్రమే! ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్లాట్‌ఫామ్‌పై బలమైన బూత్ నెట్‌వర్క్, వేల కోట్ల నిధులనిర్వహణ, పటిష్టమైన కేడర్ లేనిదే మనుగడ సాగించడం సాధ్యం కాదనేది చారిత్రక సత్యం. బాబు, జగన్, పవన్ లీడ్ చేస్తున్న ప్రధాన రాజకీయ కంబైన్లను దాటుకుని ఈ కొత్త కూటములు లేదా పార్టీలు ఒక్కశాసనసభ లేదా లోకల్ బాడీ స్థానాన్ని కూడా సొంతంగా ప్రభావితం చేయలేవని అనుకోవచ్చు.

# 34 శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

**రాజమండ్రి అక్టోబరు 9, పెన్ పవర్:** ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్ధతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలికకాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటినిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది.అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ట స్థాయిలో స్థానికపదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులు గా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహానిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపర మైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైనవెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనేనిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి–ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు.మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరఫున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించేవెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు. కేవలం రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉండే ప్రభుత్వ రిజర్వేషన్ల పేరు చెప్పి కాలంవెళ్లదీస్తాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ రిజర్వేషన్ల కంటితుడుపు చర్యలు కేవలం ఎన్నికల నాటికి ఓటర్లను మభ్యపెట్టడానికే తప్ప క్షేత్రస్థాయిలో బీసీలకు దక్కే నికర ప్రయోజనం శూన్యమని నెటిజన్లుతీవ్రంగా విమర్శిస్తున్నారు.కోర్టు తీర్పుల సాకుతో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లడం, పొలిటికల్ మైలేజ్ మాత్రం పొందే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారింది.చట్టం పరిధి తెలిసీ ప్రజలను ఆశల్లో ముంచెత్తడం, ఆ తర్వాత న్యాయస్థానాల వైపు వేలు చూపించడం అనేది ఏపీ . ఇతర రాష్ట్రాల రాజకీయాల్లో ఒక ఫార్ములాగా మారిపోయింది. రాజకీయ పార్టీలు ఈ డ్రామాలను పక్కనపెట్టి, నిజాయితీగా పార్టీటికెట్ల పంపిణీలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదా రాజ్యాంగ సవరణల దిశగా జాతీయ స్థాయిలో ఒత్తిడి తేడమే నిజమైన పరిష్కారమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

## ఎన్నికలు వాయిదా సాధ్యమేనా

**నెల్లూరు, అక్టోబరు 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికలకు ముందే రాజకీయ వేడి రాజుకుంది. ఒకవైపు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం.. మరోవైపు అదే రిజర్వేషన్లను కోర్టులో సవాలు చేసినపిటిషన్లు.. తాజాగా హైకోర్టు తీర్పు.. ఆ తర్వాత సుప్రీంకోర్టు మెట్లెక్కిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇదంతా కేవలం న్యాయపరమైన వివాదమేనా? లేక స్థానిక ఎన్నికల వెనుక పెద్ద రాజకీయ వ్యూహంనడుస్తోందా?ఆగస్టు 20, 2026న ఏపీ ప్రభుత్వం జారీ చేసిన +.వా.వీం.చీశీ.105 ద్వారా పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 1న ఏపీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 34 శాతం బీసీ రిజర్వేషన్‌కు సంబంధించినప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా గరిష్ఠంగా ఆరు వారాల్లో ప్రారంభించాలని ఆదేశించింది.వైసీపీ వర్గాలు మాత్రం 34 శాతం బీసీ కోటా చట్టపరమైనపరిమితులను దాటుతుందని ముందే హెచ్చరించామని చెబుతున్నాయి. వైసీపీ అధికారిక వాదన ప్రకారం.. ప్రభుత్వం చట్టపరమైన సమస్యలు వస్తాయని తెలిసినా 34 శాతం కోటాను ప్రకటించి తర్వాత కోర్టుఅడ్డంకిని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని ఆరోపిస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే 34 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చామని చెబుతోంది.వైసీపీఅధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికలను ఎదుర్కోవడానికి భయపడుతున్నారని, అందుకే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని న్యాయపరమైన వివాదంగా మార్చి ఎన్నికలను ఆలస్యం చేయాలనిచూస్తున్నారని కూటమి వర్గాలు ఆరోపిస్తున్నాయి.పంచాయతీ ఎన్నికలు జరిగితే గ్రామస్థాయిలో అధికార పార్టీ, ప్రతిపక్షాల బలాబలాలు స్పష్టంగా బయటపడతాయి. ఎవరి క్యాడర్ బలంగా ఉంది? ఎవరినాయకత్వానికి గ్రామాల్లో ఆదరణ ఉంది? ఏ సామాజిక వర్గం ఎటువైపు నిలుస్తోంది? అన్నది ఎన్నికల ఫలితాలతో తేలిపోతుంది. అందుకే స్థానిక ఎన్నికలే ఇప్పుడు రెండు ప్రధాన పార్టీలకు రాజకీయపరీక్షగా మారాయి.స్థానిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వివిధ గ్రాంట్లు, ఆర్థిక సంఘాల నిధులు, అభివృద్ధి నిధులు అందుతాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2021–26 కాలానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణస్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.10,231 కోట్ల కేటాయింపు ఉండగా రూ.10,055.82 కోట్లు విడుదలయ్యాయి. అయితే రూ.12,000 కోట్ల "పే కమిషన్ నిధులు"ఎన్నికలను ఆపడానికి జగన్ చేస్తున్న కుట్రలో భాగమే ఈ ఎన్నికలు అడ్డుకునే ప్రక్రియ అనే వాదన వినిపిస్తోంది.బీసీ రిజర్వేషన్లను వైసీపీ ఎందుకు అడ్డుకుంటోంది.? ప్రభుత్వం తీసుకొచ్చిన 34 శాతంకోటా చట్టపరమైన పరీక్షను ఎందుకు మోకాలడ్డుతోంది.? టీడీపీకి ఎన్నికల్లో ప్రయోజనం దక్కుండా చేసేందుకే ఈ కుట్ర చేస్తోంది.? ఎన్నికలు ఆలస్యం అయితే రాజకీయంగా వైసీపీకి లాభమా? గ్రామీణస్థాయిలో బలాబలాలు బయటపడకుండా ఎన్నికల ప్రక్రియను సాగదీయడం వైసీపీ వ్యూహమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రోజుల్లో కోర్టు తీర్పులతో పాటు రాజకీయ పరిణామాలు కూడాఇవ్వనున్నాయి.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది. అక్టోబర్ 9న ఈ అంశంపై సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జరగనుంది. కాబట్టి.. ఇది కేవలం 34 శాతం బీసీరిజర్వేషన్ వివాదం కాదు. ఇది గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న మరో పెద్ద పోరాటం.ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి? బీసీలకు చివరకు ఎంత రిజర్వేషన్ దక్కుతుంది?కోర్టు నిర్ణయం ఎటువైపు ఉంటుంది? మరి ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయంగా లాభపడేది ఎవరు? సమాధానం కోసం రాబోయే పరిణామాలను గమనించాల్సిందే!

## అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్ పనులను పరిశీలిచిన మంత్రి కొల్లు

**మచిలీపట్నం పెన్ పవర్:** మంత్రి కొల్లు రవీంద్ర గురువారం అర్ధరాత్రి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ కు వెళ్లారు. అర్ధాంతంగా పనులు నిలిపి వేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. అధికారుల బాధ్యతారాహిత్యం, గుత్తేదారు నిర్లక్ష్యవైఖరిపై అసహనం వ్యక్తం చేసారు. హార్బర్ నుండే కలెక్టర్ కు ఫోన్ చేసి మాట్లాడారు. కాంట్రాక్టర్ ఉద్దేశ్య పూర్వకంగా పనులు జాప్యం చేస్తున్నారని కలెక్టర్ కి ఫిర్యాదు చేసారు. మీరెందుకు దృష్టి పెట్టడం లేదనికలెక్టర్ ని ప్రశ్నించారు. మూడేళ్ల కాలపరిమితితో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఐదేళ్లు పూర్తయినా ఎందుకు పనులు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని నిలదీసారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేయాలని కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు సూచించారు. పనులు పూర్తి చేయడానికి నాలుగు నెలలు సమయం ఇవ్వాలని మంత్రిని గుత్తేదారు కోరారు. ఇంకెంత సమయం ఇవ్వాలని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇప్పటికే రెండు సంవత్సరాలు కాల పరిమితిని పెంచినా పురోగతి లేదని మండిపడ్డారు. సీ మౌత్ డిజైన్ రాకపోవడం వల్ల పనుల్లో ఆలస్యం అయిందని గుత్తేదారు తెలిపాడు. కుంటిసాకులు ఇంకెన్ని రోజులు చెబుతారని గుత్తేదారుపై మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీ చేసారు. తక్షణం పనులు ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేసి కాంట్రాక్టర్ ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

## రఘురామకు స్థానిక సంస్థల ఎన్నికల సెగ తగిలే ఛాన్స్ ఉందా?




ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సెగ తగిలే అవకాశముంది. ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణ రాజు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఆయన బలపర్చిన అభ్యర్థులకు కూటమిలోని నేతలే ప్రశ్నించే అవకాశాలున్నాయి. కూటమి పార్టీల ఓట్ల బదిలీపై కూడా అనుమానం తలెత్తుతుంది. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయాలపై వివిధ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహిస్తున్న తొలి స్థానిక సంస్థల ఎన్నికలు ఇవి కావడంతో, రఘురామ కృష్ణరాజు సొంత నియోజకవర్గమైన ఉండిలో పార్టీని గెలిపించుకోవడం ఆయనకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయిన తర్వాత అనేక వివాదాలకు కేంద్రంగా మారారు. అదే సమయంలో సొంత పార్టీ నేతలను కూడా దూరం చేసుకున్నారు. అదే సమయంలో కూటమిలోని ఇతర పార్టీల నేతలు కూడా రఘురామ కృష్ణరాజు ను సమర్థించేవాళ్లు తక్కువగా ఉన్నారు.

**టిక్కెట్ల కేటాయింపు నుంచి...**

ఉండి నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నేతల మధ్య స్థానిక సంస్థల టికెట్ల కేటాయింపులో సయోధ్య కుదర్చడం రఘురామకృష్ణరాజుకు అత్యంత కీలకమైన అంశం. స్థానిక నేతల ఆశలు, అసంతృప్తులను సమన్వయం చేసుకోకపోతే అంతర్గత పోరు తగిలే అవకాశం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 34 శాతం బీసీ రిజర్వేషన్లకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇటీవలే మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తుది నిర్ణయం ఆధారంగా మరికొద్దిరోజుల్లోనే టికి ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. ఈ రిజర్వేషన్ల రొటేషన్ ప్రక్రియలో స్థానిక సమీకరణాలను బట్టి అభ్యర్థులను ఖరారు చేయడం స్థానిక ఎమ్మెల్యేగా రఘురామ కృష్ణరాజుకు ఒక పరీక్ష వంటిదే. గత ఎన్నికల్లో చివరి నిమిషంలో ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్ ను రఘురామ కృష్ణరాజు పొందగలిగారు.

**వైసీపీ కొంత కసిగానే...**

రఘురామ కృష్ణరాజు వాస్తవానికి పార్లమెంటుకు పోటీ చేయాలని భావించినా అది వీలు కాలేదు. వైసీపీ నుంచి బయటకు వచ్చి బీజేపీలో చేరదామని భావించి తిరిగి చివరి నిమిషంలో టీడీపీలో చేరి ఉండి టిక్కెట్ దక్కించుకున్నారు. రఘురామ కృష్ణరాజు గౌరవ ప్రదమైన డిప్యూటీ శాసనసభ స్పీకర్ పదవి లభించింది. అయితే ఆయన ఉండి నియోజకవర్గంలో తీసుకున్న పలు నిర్ణయాలు ఇబ్బందికరంగా మారాయి. మరొకవైపు ఆక్వా రైతులు కూడా దెబ్బకొట్టే అవకాశముంది. గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీగా గెలిచి, ఆ తర్వాత ఆ పార్టీతో విభేదించి టీడీపీలో చేరిన రఘురామకృష్ణరాజుపై ఎలాగైనా పైచేయి సాధించాలని ప్రతిపక్ష వైసీపీ వ్యూహాలు ప్రతివ్యూహాలు రచిస్తోంది. ఉండి నియోజకవర్గ పరిధిలో స్థానిక ఎన్నికల ద్వారా తమ బలాన్ని నిరూపించుకోవాలని ప్రతిపక్షం గట్టిగా ప్రయత్నిస్తోంది.ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్ హోదాలో రఘురామకృష్ణరాజు నియోజకవర్గంలో స్థానిక అభివృద్ధి కార్యక్రమాలు, దాతల సహకారంతో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టారు. క్షేత్రస్థాయిలో కూటమి ఓటు బ్యాంకును పటిష్టం చేసుకుంటూ, అసంతృప్తులను చల్లార్చగలిగితే ఎన్నికల సెగను తట్టుకుని ఆయన తన పట్టును నిలుపుకోగలరా? అన్నదే ప్రశ్న. చూడాలి రఘురామ ఈ స్థానిక సంస్థలను ఎలా నెగ్గుకొస్తారో...?

దేశవ్యాప్తంగా జరిగిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పునఃసమీక్షలో జరిగిన అక్రమాలని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ సాగుతున్న ఆందోళన, అక్టోబర్ 10న కొత్త దశలోకి అడుగుపెడుతోంది. 'కాక్రోచ్ జనతా పార్టీ'తోపాటు పలు విద్యార్థి సంఘాలు నేడు జంతర్ మంతర్ వద్ద ఇప్పటికే సాగుతున్న నిరసనల్లో చేరనున్నాయి. "సీఈసీ రాజీనామా చేయకపోతే దేశం నలుమూలల నుంచీ వచ్చి ఢిల్లీలో నిరసన తెలుపుతాం, పోలీసులు ఆపితే ఎక్కడ ఆపితే అదే మా జంతర్ మంతర్ అవుతుంది, ఇది శాంతియుత ఆందోళన" అని సీజేపీ ఇప్పటికే ప్రకటించింది. ఈ ఆందోళన శాంతియుతంగా సాగడం అందరి ప్రయోజనం. నిరసనకారులు, ప్రభుత్వం, ముఖ్యంగా ఢిల్లీ పోలీసులు వివేకంతో, సంయమనంతో వ్యవహరించాలి. శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును రాజ్యాంగం గుర్తిస్తుంది, ఈ విషయాన్ని రెండు పక్షాలూ గౌరవించాలి. ఎస్ఐఆర్‌లో ఎలాంటి తప్పు లేకుండా జాబితాల నుంచి తొలగించబడ్డ ప్రజల కోసం న్యాయం కోరే ఈ గళం శాంతియుతంగా వినిపించేలా చూడాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉంది. లక్ష్యమెంత ముఖ్యమో, అక్కడికి చేరే మార్గమూ అంతే, కొన్నిసార్లు అంతకంటే ఎక్కువ ముఖ్యం కూడా. ప్రస్తుత ఆందోళనకు ఉన్న కారణం నిజమైనది, సద్భావనతో కూడినది. ఒకరిద్దరు అల్లరిమూకల వల్ల అది పట్టాలు తప్పకుండా చూసుకోవాలి. ఎన్నికల సంఘం ఈ ఫిర్యాదుల్లో కొన్నింటిని పరోక్షంగా అంగీకరించి, తొలగించబడిన అర్హులైన ఓటర్లను చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. అయితే ఇది సరిపోదని, 'అకౌంటబిలిటీ' ముఖ్యమన్నది నిరసనకారుల డిమాండ్. 'సర్'లో ఎలాంటి అక్రమాలూ జరగలేదని, ప్రక్రియ నిబంధనల ప్రకారమే సాగిందని ఎన్నికల సంఘం, అధికార పక్షం వాదిస్తున్నాయి. ఈ వాదనల మధ్య నిజానిజాలను తేల్చాల్సింది సుప్రీంకోర్టువంటి రాజ్యాంగ సంస్థలే!

ఈ ఆందోళనకు వాతావరణాన్ని కొంత ఉద్రిక్తం చేస్తున్నది, పోలీసుల ప్రవర్తనపై ఇప్పటికే వచ్చిన ఆరోపణలు. ఈ ఏడాది జులై 20న పరీక్షా పేపర్ల లీకేజీలకు వ్యతిరేకంగా, నీట్-యూజీ సహా పోటీ పరీక్షల అక్రమాలపై సాగిన దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా 'ఛలో సంసద్' పేరుతో విద్యార్థులు మార్చ్ చేశారు. ఆ సందర్భంగా పోలీసులు అధిక బలప్రయోగం చేశారని, కనీసం 60మంది నిరసనకారులు గాయపడ్డారని, లింగ ఆధారిత హింస ఆరోపణలు వచ్చాయని పిటిషన్లు పేర్కొన్నాయి, వీటిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అప్పటి కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా సాగిన ఆ నిరసనలో, పోలీసులు చాలామంది యువకులను, వారిలో టీనేజర్లనూ, ఊహించని విధంగా ఎదుర్కొన్న తీరు ప్రశ్నార్థకమైంది. ఈ ఘటన ప్రజల్లో ఎంత ఆగ్రహాన్ని రేకెత్తించిందంటే, సుప్రీంకోర్టు స్వయంగా జోక్యం చేసుకుని, ఒక మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని కొన్ని విశ్లేషణలు పేర్కొన్నాయి. ఈ తాజా నిరసనల్లోనూ పోలీసుల ప్రవర్తనపై విశ్వాసం కలిగించే పరిస్థితి కనిపించడం లేదు. అక్టోబర్ 3న జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో, విద్యార్థి నాయకురాలి నిర్బంధాన్ని చిత్రీకరిస్తున్న ఒక మహిళా జర్నలిస్టు, ఒక

## సంయమనమే సమాధానం!

సీనియర్ పోలీసు అధికారి తనను అసభ్యంగా తాకి, నెట్టేశారని ఆరోపించారు. ఆమెతోపాటు మరో ఇద్దరు మహిళా జర్నలిస్టులూ లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. ఫిర్యాదు చేయడానికి పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా గంటల తరబడి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. జర్నలిస్టులు, నిరసనకారులు, న్యాయవాదులు ఆ స్టేషన్ ముందు గుమిగూడి డిమాండ్ చేసిన తర్వాతే, ఢిల్లీ పోలీసులు ఆ ఫిర్యాదులను "న్యాయమైన, నిష్పాక్షిక విచారణ" కోసం క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేసినట్టు ప్రకటించారు. గతంలో, ముఖ్యంగా 2023 రెజ్లర్ల నిరసనలో, సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న తర్వాతే ఎఫ్ఐఆర్‌లు నమోదైన విషయాన్నీ ఇక్కడ గుర్తుచేసుకోవాలి. అదే విధంగా, పోలీసులు నేమ్‌ప్లేట్లు తొలగించుకుని ఉండటం, యూనిఫారం లేని వ్యక్తులు పోలీసులతో కలిసి పనిచేసినట్టు కనిపించే దృశ్యాలు ఉండటం వంటి ఆరోపణలు, అంగీకారయోగ్యం కావు. అత్యంత ఉద్వేగంతో ఉన్న విద్యార్థులు, యువతను నియంత్రించడం పోలీసులకు కఠినమైన పని అన్నది నిజమే, అది వారి సహనాన్ని పరీక్షించవచ్చు. కానీ అందుకోసం వారు తమ సొంత వృత్తి నైపుణ్యంపై ఆధారపడాలి తప్ప, కిరాయి గూండాలపై కాదు. యూనిఫారంలో ఉన్న ప్రతి ఒక్కరికీ చట్టప్రకారమే నడుచుకోవాలని స్పష్టంగా చెప్పాల్సిన బాధ్యత పోలీసు నాయకత్వంపై ఉంది. ఇదే సమయంలో, కొందరు మితవాద కార్యకర్తలు జంతర్ మంతర్‌వైపు కదులుతున్నారన్న నివేదికలు ఆందోళనకు కారణమవుతున్నాయి. నిరసనకారులపై ఏ పక్షం నుంచి వచ్చే హింసనైనా సమానంగా అడ్డుకోవడం ప్రభుత్వ బాధ్యత. నిరసనకారులు కూడా ఇదే బాధ్యతను పంచుకోవాలి: ఎవరు రెచ్చగొట్టినా ప్రతిస్పందించకుండా శాంతిని పాటించడం, అల్లర్లకు ఆస్కారం ఇవ్వకపోవడం. చట్టబద్ధమైన నిబంధనలు, అనుమతులను గౌరవిస్తూనే తమ గళం వినిపించడం వల్ల వారి వాదనకు నైతిక బలం పెరుగుతుంది. ఆ బలాన్ని కాపాడుకోవాలంటే, ఏ చిన్న హింసాత్మక ఘటననూ సమర్థించకుండా, వెంటనే ఖండించే పరిణతి చూపాలి. ప్రతిపక్షం కూడా పోలీసు చర్యలపై ఆరోపణలు చేయడమే కాక, నిరసనల సమయంలో తలెత్తే ఏ హింసనైనా సమానంగా ఖండించాలి. ఇటీవల ఢిల్లీలో విద్యార్థి ఆందోళనల సమయంలో కొన్ని అవాంఛనీయ శక్తులు చేరడంతో, హింస చెలరేగి సామాన్యులు, పోలీసులు గాయపడ్డారని, ప్రధానమంత్రిపై అభ్యంతరకర భాష వాడారని వచ్చిన విమర్శలను ఉదాహరణగా చూపుతున్నారు. ఇలాంటివి నిజమైన ఉద్యమం విశ్వసనీయతను దెబ్బతీస్తాయి. ప్రభుత్వం, తన వైపునుంచి, ప్రజాస్వామ్య శక్తిని నమ్మి, నిరసనకారులతో చర్చలు జరపాలి. ఇది కొత్త ఆలోచన కాదు, ప్రధాని నరేంద్ర మోదీ అంతర్జాతీయ వేదికలపై ఇతర దేశాలకు ఇచ్చే సలహా కూడా ఇదే. ప్రజాస్వామ్యానికి సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించే శక్తి ఉంది, రెండు పక్షాలూ ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఎన్నికల సంఘం తనపై వచ్చిన అనుమానాలను నివృత్తి చేసేందుకు పారదర్శకంగా వివరణ ఇవ్వడం, సుప్రీంకోర్టు ఎస్ఐఆర్‌పై తన తీర్పును త్వరగా వెలువరించడం, పోలీసులు జర్నలిస్టుల ఫిర్యాదులపై నిష్పాక్షిక విచారణ జరపడం, ఇవన్నీ ఈ ఉద్రిక్తతను తగ్గించగల మార్గాలు. నిరసన హక్కుతోపాటు శాంతిభద్రతలను సమతుల్యం చేసినప్పుడే, జంతర్ మంతర్ వద్ద జరిగే పరీక్షలో ప్రజాస్వామ్యం గెలుస్తుంది!

### పనికొచ్చే పలుకు



## మీ మైండ్.. అప్‌గ్రేడ్ అవుతోందా!?

ఫోన్‌కు కొత్త అప్‌డేట్ వచ్చినప్పుడు, బయటికి పెద్ద మార్పేమీ కనిపించదు. కానీ లోపల సిస్టమ్ స్మూత్‌గా పనిచేస్తుంది, బ్యాటరీ ఎక్కువసేపు నిలుస్తుంది, ల్యాగ్ తగ్గుతుంది. మన ఆలోచనా విధానమూ అంతే. అది మెరుగవుతున్నప్పుడు ఒక్కసారిగా బ్యానర్లు పెట్టి చెప్పదు, కొన్ని చిన్న చిన్న అలవాట్ల రూపంలో బయటపడుతుంది.

**బోరింగ్ టైమ్‌ను ఆస్వాదించడం:** క్యూలో నిలబడినప్పుడో, బస్సు కోసం చూస్తున్నప్పుడో.. వెంటనే ఫోన్ తీస్తాం. నిమిషం ఖాళీగా ఉండటం కూడా భరించలేనిదిగా అనిపిస్తుంది. కానీ మెదడుకు ఈ ఖాళీ క్షణాలే రీఛార్జ్ పాయింట్లు. ఏ పనీ లేనప్పుడు మనసు తనలో తాను ఆలోచించుకుంటుంది, కొత్త ఐడియాలు పుడతాయి, పాత గందరగోళం సర్దుకుంటుంది. అందుకే "బోర్ కొడుతోంది" అనే ఫీలింగ్‌ను భయపడకుండా భరించగలిగేవారి మైండ్ క్రియేటివ్‌గా ఉంటుందట.

**పనికిరాని వాదనలకు దూరంగా ఉండటం:** సోషల్ మీడియాలో ఎవరో ఏదో అన్నారని, కామెంట్ సెక్షన్‌లో గంటల తరబడి గొడవపడ్డారా? దాని ఫలితమేంటి? ఎవరూ మారలేదు, మీ ఎనర్జీ మాత్రం పోయింది. పరిణతి చెందిన మైండ్ ఎప్పుడు మాట్లాడాలో, ఎప్పుడు వదిలేయాలో తెలుసుకుంటుంది. ప్రతి వాదనా గెలవాల్సిన యుద్ధం కాదు. "ఇది నా సమయానికి విలువైనదేనా?" అని ఆలోచిస్తే.. జవాబు దొరుకుతుంది.

**పుస్తకాలను ప్రేమించడం:** రీల్స్ ముప్పై సెకన్ల కిక్ ఇస్తాయి. పుస్తకం మాత్రం మనసుకు లోతైన ఆలోచనిస్తుంది. పుస్తకాన్ని ఓపికగా చదవడం అంటే, ఒక మనిషి ఆలోచనలో కొన్ని గంటలు గడపడం. దాంతో మీ ఫోకస్, ఊహాశక్తి, భాషపై పట్టు పెరుగుతాయి. రోజుకు కేవలం ఇరవై పేజీలు చదివినా, ఏడాదికి ఎన్నో పుస్తకాలు పూర్తవుతాయి. పుస్తక ప్రేమ అనేది, మీ మైండ్ "షార్ట్ కంటెంట్" నుంచి "డీప్ థింకింగ్" వైపు మళ్లుతోందనడానికి గొప్ప సూచిక.

**నిశ్శబ్దాన్ని ఇష్టపడటం:** ఇయర్‌ఫోన్లు, నోటిఫికేషన్లు, నేపథ్య సంగీతం - మన చుట్టూ శబ్దం ఎప్పుడూ ఉంటుంది. కానీ కొన్నిసార్లు ఏ శబ్దమూ లేకుండా కూర్చోవడం, మన నిజమైన ఆలోచనలను వినడానికి ఒక అవకాశం. నిశ్శబ్దంలో సౌకర్యంగా ఉండగలగడం అంటే, మీతో మీరు స్నేహంగా ఉన్నారని. అలాంటివారు ఇతరుల ఆమోదం కోసం వెంపర్లాడరు, నిర్ణయాలను స్పష్టంగా తీసుకోగలరు.

**తప్పులను స్వచ్ఛందంగా అంగీకరించడం:** "సారీ, నా తప్పే" అని చెప్పడం బలహీనత కాదు, అది అత్యంత ధైర్యమైన పని. తప్పును దాచుకోవడానికి, సాకులు వెతకడానికి చాలా శక్తి ఖర్చవుతుంది. కానీ దాన్ని అంగీకరిస్తే, ఆ బరువు వెంటనే తగ్గిపోతుంది, పైగా ఎదుటివారికి మీపై నమ్మకం పెరుగుతుంది. తప్పును ఒప్పుకునేవారే, దాన్నుంచి నేర్చుకొని మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోగలరు.

ఈ ఐదు అలవాట్లు కలిసి మీ రోజువారీ జీవితాన్ని తేలిక చేస్తాయి. ఒత్తిడి తగ్గుతుంది, ఎందుకంటే మీరు అనవసర గొడవల్లో, నిరంతర శబ్దంలో, తప్పులను దాచే ప్రయత్నాల్లో తలమునకలు కారు. ఏకాగ్రత పెరుగుతుంది, ఎందుకంటే పుస్తకాలు, నిశ్శబ్దం మీ మెదడును లోతుగా ఆలోచించేలా తీర్చిదిద్దుతాయి. సంబంధాలు మెరుగవుతాయి, ఎందుకంటే మీరు క్షమాపణ చెప్పగలరు, వాదనలను వదిలేయగలరు. నిర్ణయాలు స్పష్టంగా ఉంటాయి. కారణం -మనసు ప్రశాంతంగా ఉంది. అన్నింటినీ ఒకేసారి మార్చాల్సిన అవసరం లేదు. ఈ వారం ఒక్కటే ఎంచుకోండి: ఉదాహరణకు, రోజులో పది నిమిషాలు ఫోన్ లేకుండా కూర్చోండి. లేదా నిద్రకు ముందు ఐదు పేజీలు చదవండి. లేదా తదుపరిసారి మీరు తప్పు చేసినప్పుడు, వెంటనే "నా తప్పే" అని చెప్పండి. ఒక్క అలవాటు నిలబడితే, మిగతావి నెమ్మదిగా అవే వస్తాయి. తెలివి అంటే ఎక్కువ మాట్లాడటం, వాదించడం కాదు. ఖాళీని భరించగలగడం, నిశ్శబ్దంలో ఆలోచించగలగడం, తప్పును ఒప్పుకోగలగడం. అప్పుడే.. మైండ్ సరైన దిశలోనే అప్‌గ్రేడ్ అవుతున్నట్టు!!

# ప్రజా ఉద్యమానికి సంకేతమా?

ఈ ఏడాది మే నెలలో ఒక సుప్రీంకోర్టు విచారణలో, నకిలీ డిగ్రీలపై చర్చ సందర్భంగా నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోల్చినట్టుగా వచ్చిన మాట తీవ్ర వివాదానికి దారితీసింది. అది నకిలీ డిగ్రీదారులను ఉద్దేశించి అన్నదే తప్ప దేశ యువతను కాదని ప్రధాన న్యాయమూర్తి తర్వాత స్పష్టం చేశారు. కానీ ఆ రోజే, రాజకీయ వ్యూహకర్త అభిజీత్ దిప్కే ఆ అవమానాన్ని ఒక పతాకంగా మార్చి, 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) అనే వ్యంగ్య ఉద్యమాన్ని ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. అధికార భారతీయ జనతా పార్టీ పేరుకు పేరడీగా పెట్టిన ఈ పేరు, సామాజిక మాధ్యమాల్లో వేగంగా విస్తరించింది. ఇది ఎన్నికల సంఘం వద్ద నమోదైన రాజకీయ పార్టీ కాదు, ఇది ఒక యువ ఉద్యమం. పేపర్ లీకేజీలు, నిరుద్యోగం వంటి యువత సమస్యలతో మొదలైన ఈ ఉద్యమం, అప్పటి కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసింది, ఇది దాని తొలి పెద్ద విజయంగా పరిగణించబడింది. ఆ తర్వాత పరీక్షలు, పాఠశాలలు వంటి విద్యా రంగ అంశాలపై 'ఠీక్ కరో' (సరిదిద్దండి) అనే ప్రచార శ్రేణి సాగింది. ఇప్పుడు అకస్మాత్తుగా 'ఎలక్షన్ కమిషన్ ఠీక్ కరో' అంటూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష (ఎస్ఐఆర్)పై ఉద్యమాన్ని మొదలుపెట్టింది. ఒకవైపు ప్రతిపక్ష పార్టీలు ఇదే అంశంపై పోరాడుతుండగా, అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద భారీ నిరసనకు సీజేపీ సిద్ధమైంది. ఈ మార్పును రెండు రకాలుగా చూస్తున్నారు. ప్రజా ఉద్యమాల లక్షణమే ఇది: ఒక్క సమస్యతో మొదలై క్రమంగా విస్తృత ఉద్యమంగా మారుతాయని కొందరు వాదిస్తారు. సీజేపీ నేతలకు రాజకీయ ఆకాంక్షలున్నాయని, అందుకే ఉద్యమాన్ని విద్యా పరిధి నుంచి రాజకీయ రంగంలోకి ఉద్దేశపూర్వకంగా తీసుకెళ్తున్నారని, ఢిల్లీలో ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం ఉన్నా, దిప్కే స్వరాష్ట్రం కావడంతోనే ముంబయిలో పోరాటం ప్రారంభించారని మరికొందరి వాదన. దీనివల్ల యువత సమస్యలనే అసలు లక్ష్యం దెబ్బతిని, ఉద్యమానికే నష్టం జరుగుతుందన్నది ఇంకొక వాదన. ఏది నిజమో భవిష్యత్తే చెప్పాలి!

ఈ ప్రశ్నను అర్థం చేసుకోవడానికి చరిత్రను చూడాలి. భారత చరిత్రలో ఇలాంటి ఉద్యమాలు ఒక చిన్న సమస్యతో మొదలై, దేశ రాజకీయాలనే మార్చిన ఉదాహరణలు ఉన్నాయి. 1973 డిసెంబర్‌లో అహ్మదాబాద్‌లోని ఒక ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ మెస్ ఫీజుల పెంపును వ్యతిరేకిస్తూ విద్యార్థులు మొదలుపెట్టిన నిరసన, ప్రభుత్వ అణచివేత చర్యలతో ఉధృతమై, ఇతర విశ్వవిద్యాలయాల విద్యార్థులు, కార్మికులు, సామాన్య ప్రజలూ చేరడంతో, 1974 ఫిబ్రవరిలో సీఎం చిమన్‌భాయ్ పటేల్ ప్రభుత్వ పతనానికి దారితీసింది. అదే 'గుజరాత్ నవనిర్మాణ్ ఉద్యమం', దానిలో ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ సైతం యువ కార్యకర్తగా పాల్గొన్నట్టు చెబుతారు. అదే ఏడాది బీహార్‌లో ఉద్యోగాలు, ధరల పెరుగుదల, అవినీతిపై విద్యార్థులు మొదలుపెట్టిన ఆందోళనకు జయప్రకాష్ నారాయణ్ నాయకత్వం వహించి, 'సంపూర్ణ క్రాంతి' పిలుపునిచ్చారు. ఆ ఉద్యమం ఎమర్జెన్సీ విధింపునకు, ఆ తర్వాత 1977లో కాంగ్రెస్ ఓటమికి, జనతా పార్టీ ప్రయోగానికి దారితీసింది. ఆనాటి ప్రధాన అంశాలైన నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి, రాజకీయ



జవాబుదారీతనం ఈనాటికీ ప్రధాన సామాజిక-ఆర్థిక సవాళ్లుగానే ఉన్నాయి. అందుకే, అమెరికా మేధో సంస్థ 'కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్' కూడా సీజేపీని నేపాల్, బంగ్లాదేశ్‌లతో పోల్చడంకంటే, భారతదేశపు 1970ల ఉద్యమాలతో పోల్చడమే సమంజసమని సూచించింది. అయితే సామ్యాలతో పాటు తేడాలూ ఉన్నాయి. నేపాల్‌లో 2025 సెప్టెంబర్‌లో 26 సామాజిక మాధ్యమ వేదికలపై నిషేధంతో మొదలైన 'జెన్ జీ' ఆందోళన, ప్రభుత్వాన్ని కూల్చి, పార్లమెంట్, సుప్రీంకోర్టు భవనాలకు నిప్పుపెట్టే వరకూ వెళ్లింది. బంగ్లాదేశ్‌లో 2024లో విద్యార్థుల ఉద్యమం ప్రభుత్వ క్రూరమైన అణచివేతతో మరింత ఉధృతమై, షేక్ హసీనా పతనానికి దారితీసింది. శ్రీలంకలో 2022లో ఆర్థిక పతనం 'అరగలయ' ఉద్యమానికి కారణమైంది. ఈ దేశాల్లో అధికార, ఆర్థిక, సాంకేతిక శక్తి ఒక్క నగరంలో కేంద్రీకృతమై ఉండగా, భారత్‌లో అది వివిధ నగరాలు, రాష్ట్రాలకు విస్తరించి ఉందని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు, అందువల్ల ఒక్క రాజధానిలో జరిగే ఆందోళన పాలనను స్తంభింపజేయడం కష్టం. 1970ల ఉద్యమాలకు జయప్రకాష్ నారాయణ్ వంటి నైతిక అధికారం ఉన్న నాయకుడు, ప్రతిపక్ష పార్టీల, సంఘాల సంస్థాగత బలం ఉండేవి. సీజేపీ ప్రధానంగా డిజిటల్ వేదికపై పుట్టిన, వ్యంగ్యంతో కూడిన, నాయకత్వ నిర్మాణం ఇంకా పటిష్ఠం కాని ఉద్యమం. జూన్‌లో కొందరు నిపుణులు, ఈ ఉద్యమం విద్యా మంత్రి రాజీనామా డిమాండ్‌కే పరిమితమైందని, ఇది నేపాల్, బంగ్లాదేశ్ స్థాయికి ఎదిగే అవకాశం తక్కువని అభిప్రాయపడ్డారు, అప్పటి ఒక నిరసనకు ఉత్సాహభరిత స్పందన రాలేదనీ గుర్తుచేశారు. కానీ అప్పటి నుంచి పరిస్థితి మారింది. విద్యా మంత్రి రాజీనామా విజయం ఉద్యమానికి ఆత్మవిశ్వాసాన్నిచ్చింది, ఇప్పుడు ఎంచుకున్న అంశం, అంటే ఓటర్ల జాబితా నుంచి తొలగింపులు, కేవలం యువతకే కాక, ప్రతి ఓటరునూ తాకుతుంది. అరుంధతీ రాయ్ వంటి రచయితలు, ఈ ఉద్యమం దేశవ్యాప్త అశాంతి విస్తృత తరంగంలో భాగమని కూడా వ్యాఖ్యానించారు.

కాబట్టి, ఇది "ప్రజా తిరుగుబాటు"కు సంకేతమా? ఇప్పటికి ఇది తిరుగుబాటు కాదు, కానీ దాన్ని కేవలం ఒక ఇంటర్నెట్ సంచలనంగా కొట్టిపారేయడం కూడా సరికాదు. ఇది దేశంలోని యువతలో పెరుగుతున్న అసంతృప్తికి, వ్యవస్థల పట్ల తగ్గుతున్న నమ్మకానికి స్పష్టమైన హెచ్చరిక. ఈ ఉద్యమం నిజమైన ప్రజా ఉద్యమంగా ఎదగాలంటే కొన్ని పరీక్షలు నెగ్గాలి: ఢిల్లీ దాటి రాష్ట్రాలకు, చిన్న పట్టణాలకు విస్తరించే నిలకడైన ప్రజా మద్దతు, వివిధ వర్గాల భాగస్వామ్యం, శాశ్వత సంస్థాగత నిర్మాణం, తమను తమలో కలిపేసుకోవాలని చూసే రాజకీయ పార్టీల నుంచి స్వతంత్రత, అన్నింటికీ మించి అహింస. ప్రతిపక్షాలు ఇప్పటికే ఇదే అంశంపై పోరాడుతున్నాయి, వాటి మధ్య సీజేపీ తన ప్రత్యేక గుర్తింపును కాపాడుకోగలదా? అన్నది కీలకం. యువత సమస్యలనుంచి ఎన్నికల రాజకీయాల వైపు మళ్లడం వల్ల ఉద్యమం బలహీనపడే ప్రమాదాన్నీ విస్మరించకూడదు. పొరుగు దేశాల అనుభవం ఇందుకు హెచ్చరిక: బంగ్లాదేశ్‌లో 'జెన్ జీ' విప్లవం తర్వాత జరిగిన ఎన్నికల్లో పాత రాజకీయ శక్తులే ఆధిపత్యం చెలాయించగా, విద్యార్థులు స్థాపించిన కొత్త పార్టీ పట్టు సాధించడానికి కష్టపడింది; నేపాల్‌లో ఉద్యమం తర్వాత 120కి పైగా పార్టీలు ఎన్నికల బరిలో నిలిచాయి. వీధి ఉద్యమాలు ఎన్నికల రాజకీయాల్లో నిలదొక్కుకోవడం అంత సులువు కాదని ఇవి చెబుతున్నాయి. చివరగా, ప్రభుత్వ స్పందన ఎంత కీలకమో 1970ల చరిత్ర, నేపాల్, బంగ్లాదేశ్ అనుభవాలు రెండూ చెబుతున్నాయి. అణచివేత, నిర్లక్ష్యం, అహంకారం ఉద్యమాలను చల్లార్చవు, మరింత రాజేస్తాయి. చర్చలు, పారదర్శకత, నిష్పాక్షిక విచారణలు వాటిని శాంతియుత మార్గంలో నడిపిస్తాయి. ఎన్నికల సంఘం తనపై వచ్చిన అనుమానాలను నివృత్తి చేయకుండా, ప్రభుత్వం ఆందోళనను శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూస్తే, ఉద్యమానికి కావాల్సిన ఇంధనాన్ని అదే అందించినట్టవుతుంది. ఈ ప్రశ్నకు సమాధానం నిరసనకారుల చేతుల్లోనే కాదు, పాలకుల చేతుల్లోనూ ఉంది. ఇది తిరుగుబాటుగా మారుతుందా, లేక వ్యవస్థను సంస్కరించే ఒత్తిడిగా మిగులుతుందా? అన్నది, రెండు పక్షాలూ రాబోయే రోజుల్లో తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంది. ■



రాత్రి భోజనం చేసి వెంటనే పడుకునేవారు తరచూ ఉదయం బరువుగా, అలసటగా నిద్ర లేస్తుంటారు. పడుకునే ముందు తినడం వల్ల శరీరం విశ్రాంతికి బదులు జీర్ణక్రియలో నిమగ్నమై, నిద్రకు విఘాతం కలుగుతుంది. ఇది ఇన్సులిన్ స్థాయిలను పెంచి, ఆ కెలోరీలు కొవ్వుగా నిల్వ అయ్యే అవకాశాన్ని పెంచుతుంది. కార్టిసాల్ హార్మోన్ సమతుల్యతను, సహజ నిద్ర చక్రాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఆలస్యంగా తినే అలవాటు క్రమంగా బరువు పెరగడానికి, అజీర్ణానికి దారితీయవచ్చు. అందుకే నిద్రకు కనీసం రెండు మూడు గంటల ముందే భోజనం ముగించండి. ఆకలిగా అనిపిస్తే తేలికపాటి పండు చాలు.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## షార్క్‌లను చూసి 'మ్యావ్' అన్న పిల్లి పిల్లలు



మినియాపొలిస్ సమీపంలోని 'మాల్ ఆఫ్ అమెరికా'లోని సీ లైఫ్ అక్వేరియంలో, తల్లి లేని సుమారు రెండు డజన్ల పిల్లి పిల్లలు ఫీల్డ్ ట్రిప్‌కు వెళ్లాయి! 'బిట్టీ కిట్టీ బ్రిగేడ్' అనే సంస్థ ఆరో ఏడాది ఏర్పాటు చేసిన ఈ విహారానికి 'టర్కీ లెగ్', 'మౌత్ ట్రాప్', 'లాటీ డాటీ' వంటి పేర్లున్న పిల్లులు వచ్చాయి. "ఫైండింగ్ నీమో" క్లౌన్‌ఫిష్ తన మీసాల దగ్గరే తిరుగుతుంటే, 'టర్కీ లెగ్' వెనక కాళ్లపై నిల్చుని అద్దాన్ని పంజాతో కొడుతూ మ్యావ్ అంది! కొన్ని 90 మీటర్ల సొరంగంలో సొరచేపలను చూస్తూ పరుగెత్తగా, మరికొన్ని నీలి వెలుతురులో హాయిగా కునుకు తీశాయి. ఈ పర్యటన వాటికి సాంఘికంగా అలవాటు పడేలా చేసి, దత్తతను సులువు చేస్తుందట!

# రెండో టీ20: టాస్ గెలిచిన విండీస్.. భారత్ బ్యాటింగ్

**భారత్-వెస్టిండీస్ రెండో టీ20**

**రాంచీలో మ్యాచ్.. టాస్ గెలిచిన వెస్టిండీస్**

**మంచు ప్రభావం ఉంటుందనే అంచనాతో ఫీల్డింగ్ ఎంపిక**

**గత మ్యాచ్ ఆడిన జట్టుతోనే బరిలోకి దిగుతున్న భారత్**

**విండీస్ జట్టులో ఒక మార్పు.. మోతీకి చోటు**




రాంచీలోని జేఎస్‌సీఏ అంతర్జాతీయ స్టేడియం వేదికగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్‌లో టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని టీమిండియా తొలుత బ్యాటింగ్ చేయనుంది. సిరీస్‌లో కీలకమైన ఈ మ్యాచ్‌లో మంచు ప్రభావం చూపే అవకాశం ఉండటంతోనే ఛేజింగ్‌కు మొగ్గు చూపినట్లు విండీస్ కెప్టెన్ తెలిపాడు. టాస్ గెలిచిన అనంతరం షాయ్ హోప్ మాట్లాడుతూ.. "మేం బౌలింగ్ చేయాలని ముందుగానే భావించాం. ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌లో ఛేజింగ్ చేయడం మాకు సౌకర్యంగా ఉంటుంది. ఇక్కడి పరిస్థితులను గమనిస్తే ఇప్పటికే మైదానం కొద్దిగా తడిగా ఉంది. రాత్రి అయ్యే కొద్దీ మంచు ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే బంతితో టీమిండియాపై ఒత్తిడి పెట్టి, ఆ తర్వాత లక్ష్యాన్ని ఛేదించాలని భావిస్తున్నాం. తొలి మ్యాచ్‌లో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలి" అని వివరించాడు. జట్టులో ఒక మార్పు చేసినట్లు, ఫోర్డ్ స్థానంలో స్పిన్నర్ గుడాకేశ్ మోతీని తీసుకున్నట్లు తెలిపాడు.

భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. "మేము కూడా టాస్ గెలిస్తే బౌలింగ్ ఎంచుకోవాలనే అనుకున్నాం. కానీ పరిస్థితులకు త్వరగా అలవాటు పడటం ముఖ్యం. ప్రస్తుతం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది, కొద్దిగా మంచు కూడా కురుస్తోంది. రెండో ఇన్నింగ్స్‌లో కూడా ఇదే కొనసాగాలని ఆశిస్తున్నా. మ్యాచ్ మొత్తం 40 ఓవర్ల పాటు మా ప్రమాణాలను కొనసాగించడంపై దృష్టి పెట్టాం. విజయాల పరంపర కొనసాగించాలనుకుంటున్నాం" అని అన్నాడు. గత మ్యాచ్ ఆడిన జట్టుతోనే బరిలోకి దిగుతున్నట్లు శ్రేయస్ స్పష్టం చేశాడు.

**జట్ల వివరాలు:**

భారత్: అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, నమన్ ధీర్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, మయాంక్ యాదవ్.

వెస్టిండీస్: షాయ్ హోప్ (కెప్టెన్/వికెట్ కీపర్), కామిల్ పూరన్, షిమ్రాన్ హెట్మెయర్, రోవ్‌మన్ పావెల్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్, రోస్టన్ చేజ్, రొమారియో షెపర్డ్, గుడకేశ్ మోతీ, షమార్ స్ప్రింగర్, అకీల్ హోసేన్, షమార్ జోసెఫ్.

# పదేళ్ల తర్వాత టెస్టుల్లోకి.. చెత్త రికార్డుతో నిరాశపరిచిన ఆసీస్ బ్యాటర్

- దాదాపు పదేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి తిరిగొచ్చిన నిక్ మ్యాడిన్సన్
- దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో 33 బంతులు ఆడి డకౌట్
- టెస్టుల్లో అత్యధిక బంతులు ఆడి డకౌటైన ఆస్ట్రేలియా ఓపెనర్‌గా చెత్త రికార్డు
- క్యాన్సర్‌ను జయించి పునరాగమనం చేసిన మ్యాడిన్సన్‌కు తీవ్ర నిరాశ
- 2016 తర్వాత మళ్లీ ఇప్పుడే టెస్టు మ్యాచ్ ఆడుతున్న ఆసీస్ బ్యాటర్




ఆస్ట్రేలియా క్రికెటర్ నిక్ మ్యాడిన్సన్ దాదాపు పదేళ్ల తర్వాత టెస్టు క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. అయితే, ఈ ఎమోషనల్ కమ్‌బ్యాక్ అతనికి తీవ్ర నిరాశను మిగిల్చింది. దక్షిణాఫ్రికాతో డర్బన్‌లో జరుగుతున్న తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 33 బంతులు ఎదుర్కొని పరుగులేమీ చేయకుండా డకౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఒక చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. శుక్రవారం మొదలైన ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ మార్కో యన్సెన్ బౌలింగ్‌లో మ్యాడిన్సన్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఫలితంగా, టెస్టు క్రికెట్‌లో అత్యధిక బంతులు ఎదుర్కొని డకౌటైన ఆస్ట్రేలియా ఓపెనర్‌గా నిలిచాడు. ఇంతకుముందు ఈ రికార్డు డేవిడ్ వార్నర్ (22 బంతులు) పేరిట ఉండేది. అంతేకాకుండా, 21వ శతాబ్దంలో ఒక టెస్ట్ ఓపెనర్ ఆడిన అత్యంత సుదీర్ఘ డకౌట్ ఇన్నింగ్స్ కూడా ఇదే కావడం గమనార్హం. 34 ఏళ్ల మ్యాడిన్సన్ చివరిసారిగా 2016 డిసెంబర్‌లో టెస్టు మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత 2025లో అతనికి వృషణాల క్యాన్సర్ నిర్ధారణ అయింది. కీమోథెరపీ తీసుకుని, వ్యాధిని జయించి మళ్లీ దేశవాళీ క్రికెట్‌లో రాణించి జట్టులోకి వచ్చాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (9) కూడా త్వరగానే ఔటయ్యాడు. క్యాన్సర్‌పై పోరాడి గెలిచి జట్టులోకి వచ్చిన మ్యాడిన్సన్ కథ స్ఫూర్తినిచ్చినా, మైదానంలో అతను నమోదు చేసిన ఈ చెత్త రికార్డు అతని పునరాగమనానికి చేదు జ్ఞాపకంగా మారింది.

# భువనేశ్వర్ రీఎంట్రీ వెనుక అసలు కారణమిదే.. బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ఆసక్తికర వ్యాఖ్యలు!

- నాలుగేళ్ల తర్వాత భువనేశ్వర్‌కు టీమిండియాలో చోటు
- పునరాగమనానికి అనుభవం, ఐపీఎల్ ప్రదర్శనే కారణమన్న బ్యాటింగ్ కోచ్
- యువ బౌలర్లతో పాటు అనుభవజ్ఞులూ అవసరమన్న సితాన్షు కోటక్
- షమీ ఎంపికపై సెలెక్టర్లదే తుది నిర్ణయమని స్పష్టీకరణ
- షమీ కూడా బాగా ఆడుతున్నాడని వ్యాఖ్య




టీమిండియా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ నాలుగేళ్ల విరామం తర్వాత మళ్లీ భారత టీ20 జట్టులోకి వచ్చాడు. అతడి పునరాగమనానికి ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో పాటు అపార అనుభవం కూడా కారణమని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ వెల్లడించాడు. యువ బౌలర్లు బాగా రాణిస్తున్నప్పటికీ, కీలక సమయాల్లో అనుభవం కూడా అవసరమని అభిప్రాయపడ్డాడు. భువనేశ్వర్ కుమార్ చివరిసారిగా 2022 నవంబర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత్ తరఫున ఆడాడు. ఆ తర్వాత జాతీయ జట్టుకు దూరమైన అతడు.. ఐపీఎల్‌లో మాత్రం తన సత్తా చాటాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడుతూ 2025 సీజన్‌లో 17 వికెట్లు, 2026 సీజన్‌లో 28 వికెట్లు పడగొట్టాడు. రెండు సీజన్లలో కలిపి 45 వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఆ రెండు సీజన్లలో ఆర్‌సీబీ వరుసగా ఐపీఎల్ టైటిళ్లు గెలుచుకుంది. ఇంగ్లండ్ పర్యటన సమయంలో జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడం, యువ బౌలర్లు ఎక్కువగా ఉండటంతో అనుభవజ్ఞుల అవసరం కనిపించిందని కోటక్ చెప్పాడు. యువ ఆటగాళ్లు బాగా ఆడుతూ జట్టులోకి వస్తున్నారని, అయితే కొన్ని సందర్భాల్లో అనుభవానికి కూడా ప్రాధాన్యం ఉంటుందని వివరించాడు. ఐపీఎల్‌లో భువనేశ్వర్ నిలకడగా రాణించడం కూడా అతడి ఎంపికకు కారణమై ఉండొచ్చని పేర్కొన్నాడు. మరో సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ పునరాగమనంపై మాత్రం కోటక్ స్పష్టమైన వ్యాఖ్యలు చేయలేదు. షమీ కూడా మ్యాచ్‌లు ఆడుతూ బాగా రాణిస్తున్నాడని, అతడి ప్రదర్శనతో పాటు జట్టు అవసరాలను పరిగణనలోకి తీసుకుని సెలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారని చెప్పాడు. తాను సెలెక్టర్‌ను కానందున షమీ ఎంపికపై తుది నిర్ణయం చెప్పలేనని స్పష్టం చేశాడు. వీవీఎస్ లక్ష్మణ్‌ను సెలక్షన్ సమావేశాల్లో భాగం చేయడం, జట్టు యాజమాన్యం నుంచి సెలెక్టర్లకు ఆటగాళ్ల గాయాల సమాచారాన్ని చేరవేసే బాధ్యత అప్పగించారన్న వార్తలపైనా కోటక్ స్పందించాడు. ఈ విషయం తనకు కూడా మీడియా ద్వారానే తెలిసిందని చెప్పాడు. బీసీసీఐ తీసుకున్న నిర్ణయం వెనుక సరైన కారణం ఉంటుందని భావిస్తున్నానని తెలిపాడు.

# శృతి హాసన్.. పర్సనల్ ఫ్రీడమ్ కు లిమిట్స్ ఎక్కడ?







హీరోయిన్లు తమ పర్సన్ లైఫ్ పై మాట్లాడటం కొత్తేమీ కాదు. కానీ కొన్ని విషయాలపై ఓపెన్ గా మాట్లాడితే మాత్రం వెంటనే డిబేట్ స్టార్ట్ అవుతుంది. ఇప్పుడు స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్ చేసిన కామెంట్స్ కూడా అలాంటి చర్చనే మొదలుపెట్టాయి. అయితే ఆమె చేసిన కామెంట్స్ కంటే.. దాని వెనుక ఉన్న ఆలోచన ఏంటనేదే అసలు అబ్జర్వ్ చేయాల్సిన విషయం.

శ్రుతి హాసన్ రీసెంట్ గా సెల్ఫ్ కేర్, పర్సనల్ ఫ్రీడమ్ వంటి విషయాలపై మాట్లాడారు. ఆ సమయంలో సెలిక్స్ టాయ్స్ ను కూడా సెల్ఫ్ కేర్ లో భాగంగా చూడొచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ఆ విషయంలో ఇతరుల పర్మిషన్ అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత నిర్ణయాలను తామే తీసుకునే ఫ్రీడమ్ ఉండాలని చెప్పారు. ఇక్కడ శ్రుతి చెప్పిన అసలు పాయింట్ ఒక వస్తువు గురించి మాత్రమే కాదు.

మన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన నిర్ణయాలపై సొసైటీ ఎంతవరకు ఎఫెక్ట్ చూపించాలనేదే ఆమె కామెంట్స్ లో కనిపిస్తున్న మెయిన్ ఎలిమెంట్. ముఖ్యంగా పర్సనల్ లైక్స్, రిలేషన్స్, బాడీ, ప్రైవసీ వంటి విషయాల్లో ఇతరులు చేసే జడ్జిమెంట్లకు భయపడకుండా.. తమకు ఏది కంఫర్ట్ గా ఉంటుందో దానిని వ్యక్తులు నిర్ణయించుకోవాలన్నది ఆమె అభిప్రాయంగా కనిపిస్తోంది.అయితే మన సొసైటీలో ఇలాంటి విషయాలు ఇప్పటికీ కామన్ గా మారలేదు. అందుకే శ్రుతి కామెంట్స్ బయటకు వచ్చిన వెంటనే ఆమె చెప్పిన విషయం కంటే.. ఆమె ఎందుకు ఇలా మాట్లాడారనే యాంగిల్ లో ఎక్కువగా చర్చ జరుగుతోంది. కొందరికి ఇది పర్సనల్ ఫ్రీడమ్ గురించి చెప్పిన జస్ట్ ఒపీనియన్ గా కనిపిస్తే.. మరికొందరికి మాత్రం ఇలాంటి విషయాలను బహిరంగంగా మాట్లాడటం అవసరమా అనే ప్రశ్న రావచ్చు.అందుకే శ్రుతి ఒపీనియన్ తప్పా? ఒప్పా? అనే విషయం ఇంట్రెస్టింగ్ గా మారింది. నిజానికి ఆమె కామెంట్స్ ను అందరూ ఒకే విధంగా చూడాల్సిన అవసరం లేదు. వ్యక్తిగత ఎంపికల విషయంలో ఎవరి అభిప్రాయం వారిదే. అయితే పర్సన్ ఫ్రీడమ్ అంటే బాధ్యత కూడా ఉండాలనే విషయం కూడా అంతే ముఖ్యమైనది. ఏ వ్యక్తిగత నిర్ణయమైనా అది తనకు, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా ఉండటం అవసరం.

మరోవైపు సెల్ఫ్ కేర్ అనే పదానికి కూడా అర్థం మారుతుంది. గతంలో ఇది హెల్త్, రెస్ట్, పీస్ ఫుల్ నెస్ వంటి విషయాలకే ఎక్కువగా పరిమితమయ్యేది. ఇప్పుడు పర్సనల్ కంఫర్ట్, ప్రైవసీ, ఎమోషనల్ నీడ్స్ అవసరాలు కూడా ఇందులో భాగంగా చర్చకు వస్తున్నాయి. శ్రుతి కామెంట్స్ ను కూడా మారుతున్న థింకింగ్ ప్రాసెస్ లో చూడొచ్చు.

అందుకే ఆమె మాటలను కేవలం బోలిల్డ్ కామెంట్స్ గా చూడటం కంటే.. పర్సనల్ ఫ్రీడమ్, ప్రైవసీ, సామాజిక తీర్పులపై ఆమె చెప్పిన అభిప్రాయంగా చూడటం బెటర్. అయితే యాక్సెప్ట్ చేయాలా లేక వ్యతిరేకించాలా అనేది ఎవరి వ్యక్తిగత ఆలోచన వారిదే. కానీ సాధారణంగా మాట్లాడటానికి ఇబ్బంది పడే అంశంపై శ్రుతి మరోసారి తన అభిప్రాయాన్ని క్లియర్ గా చెప్పారని అనడంలో డౌట్ అక్కర్లేదు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965